నమస్తే హైదరాబాద్

మీ గళం.. మా కలం...

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

రంగారెడ్డి Rangareddy | మంగళవారం 17-11-2026 TUESDAY 17-11-2026 | సంపుటి: 15 Volume: 15 | సంచిక: 157 Issue : 157 | పేజీలు : 8 Page's: 8 | వెల: 3/- Rs: 3/-

"చదువు చేదుగా ఉంటుంది కానీ అది ఇచ్చే ఫలాలు ఎప్పుడూ తీయగా ఉంటాయి"

తెలంగాణలో విద్యుత్ కోతలు ఉండొద్దు..
భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు



హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్): తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రబీ సీజన్‌లో రైతులు, ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అక్టోబర్ 16న రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 20,018 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని, పరుసగా రెండో రోజు కూడా 20,003 మెగావాట్ల డిమాండ్ వచ్చినట్లు తెలిపారు. గతేడాది నవంబర్ 16న 8,522 మెగావాట్లుగా ఉన్న డిమాండ్ ఈ ఏడాది 12,802 మెగావాట్లకు పెరిగిందన్నారు. చారిత్రాత్మక స్థాయిలో డిమాండ్ పెరిగినప్పటికీ సమర్థంగా విద్యుత్ సరఫరా చేసిన అధికారులను అభినందించారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా జలవిద్యుత్ ఉత్పత్తిలో 4,000 మెగావాట్ల కొరత ఏర్పడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని

మిగతా 2లో...

ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు..
రైతులు అప్రమత్తంగా ఉండాలి

- రైతులను ఆదుకుంటున్నాం..
- సత్తుపల్లికి గోదావరి జలాలు..
- సీఎం రేవంత్‌రెడ్డిని సత్తుపల్లికి తీసుకువస్తా..
- మూడువేల ఎకరాల్లో పామాయిల్ సాగు..



ఖమ్మం జిల్లా, (నమస్తే హైదరాబాద్): ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తీవ్రమైన ఎండలు, కరువు పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యా నించారు. రైతులు తమ భూమిలో నీటి లభ్యత, వాతావరణ పరిస్థితుల ఆధారం గా పంటల సాగుపై నిర్ణయం తీసుకో వాలని సూచించారు. (సోమవారం) చల్లగుళ్ళ నరసింహారావు సత్తుపల్లి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని, ప్రసంగించారు. రైతన్నలకు తెలిసినంతగా శాస్త్రవేత్తలకు, అధికారులకు, రాజకీయ నాయకులకు వ్యవసాయం గురించి తెలియదని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకొని అన్నదాతలు నష్టాలు రాకుండా పంటలు సాగు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. మొక్కజొన్న, శనగలు, జొన్నలు, సోయా, సన్‌ఫ్లవర్, ధాన్యం వంటి పంటలకు కేంద్రప్రభుత్వం ప్రకటించిన

మిగతా 2లో...

ఇళ్ల పథకం లబ్ధిదారులకు తెలంగాణ సర్కార్ ఊరట



హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్): 2014కు ముందు ఎంపిక చేసిన ఇళ్ల పథకం లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల వాపస్‌కు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది లబ్ధిదారులకు ఈ ప్రయోజనం కలగనుందని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న పట్టాలను లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయం తీసుకుందని

మిగతా 2లో...

మా కుటుంబంపై ఎన్నో అవాస్తవ కథనాలు అల్లారు
- అందుకే ఆత్మకథ రాశా


- కొన్ని విమర్శలు నిజాయతీగా ఉన్నాయి: సోనియా
- తరలివచ్చిన విపక్ష నేతలు, ప్రముఖులు



న్యూ ఢిల్లీ :తన కుటుంబం గురించి బయట ప్రచారంలో ఉన్న కథనాల్లో చాలా వరకు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. తన అత్త (ఇందిరా గాంధీ), భర్త (రాజీవ్ గాంధీ), కుమార్తె (ప్రియాంక గాంధీ వాద్రా), కుమారుడు (రాహుల్ గాంధీ) సహా తన గురించి ఎన్నో అసత్యాలు, కల్పిత కథనాలు అల్లారని వాటిని తిప్పికొట్టడానికే తాను ఆత్మకథ పుస్తకం రాయాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన జీవిత అనుభవాలను, తన కుటుంబం గురించి తనకు తెలిసిన వాస్తవాలను ప్రజలతో పంచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ పుస్తకం రాసినట్లు తెలిపారు.తన అత్త ఇందిరా గాంధీ, భర్త రాజీవ్ గాంధీ హత్యలకు

మిగతా 2లో...

అమిత్ షా పర్యటన.. విజయవాడలో
'నో ఫ్లైయింగ్ జోన్' అమలు



విజయవాడ, (నమస్తే హైదరాబాద్): కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా ఈరోజు విజయవాడలో పర్యటించనున్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో జరగనున్న రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర హోంమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 'నో ఫ్లైయింగ్ జోన్'ను అమలులోకి తీసుకొచ్చారు.? సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ కళా వేదికతో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాలను 'నో ఫ్లైయింగ్ జోన్'గా సీపీ రాజశేఖర్ బాబు ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వీఐపీల పర్యటన ముగిసే వరకు ఎటువంటి డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, పారాగ్లైడర్లు, హాట్ ఎయిర్ బెలూన్లు, ఇతర ఎగిరే వస్తువులను ఎగురవేయడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండా నిషేధిత పరిధిలో డ్రోన్లతో పాటు ఇతర ఎగిరే పరికరాలను వినియోగించ వద్దని తెలిపారు. అలా చేస్తే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్ నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా సదరు

మిగతా 2లో...

పోలీస్ శాఖల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం
శుభపరిణామం



హైదరాబాద్, న(నమస్తే హైదరాబాద్): పోలీస్, మార్షల్ బ్యాండ్ సంప్రదాయానికి శతాబ్దాల చరిత్ర ఉందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. (సోమవారం) హకీంపేట సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీలను డీజీపీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్ బ్యాండ్ బలగాలు.. క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీకగా చెప్పుకొచ్చారు. ఈ ఏడాది పోటీల్లో తొలిసారిగా మహిళా బ్యాగ్లర్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. సీఆర్పీఎఫ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి మహిళా బ్యాగ్లర్ల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు.పోలీస్ శాఖల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం శుభపరిణామమని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బ్యాండ్ బృందాలకు తెలంగాణ తరఫున సాదర స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, సాలార్‌జంగ్ మ్యూజియం సందర్శించాలన్నారు. హైదరాబాద్ బిర్యానీ, హలీమ్ రుచులను ఆస్వాదించడం మర్చిపోవద్దని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బ్యాండ్ బృందాలకు తెలిపారు. గతంలో నక్సలైట్లకు వ్యతిరేకంగా సీఆర్పీఎఫ్, తెలంగాణ పోలీసులు కలిసి పనిచేశారని గుర్తుచేశారు. దేశ భద్రతలో పోలీస్ బలగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి



నిజామాబాద్, (నమస్తే హైదరాబాద్): తెలంగాణ రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచు కుని ప్రభుత్వం తక్షణమే స్పం దించాలని టీఆర్ఎస్ అధ్యక్షు రాలు కల్వకుంట్ల కవిత డిమా ండ్ చేశారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని

మిగతా 2లో...

ఈ నెల 20న కోస్తాంధ్రను తాకనున్న
తీవ్ర తుపాను.



- అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు
- బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం
- ఈ సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం
- ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- గోదావరి, కృష్ణా, గుంటూరు సహా పలు జిల్లాలపై ప్రభావం
- ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

అమరావతి (నమస్తే హైదరాబాద్):ఈ నెల 20వ తేదీన కోస్తాంధ్ర తీరాన్ని తీవ్ర తుపాను తాకనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ముప్పు పొంచి ఉన్నందున క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఉన్న ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన

మిగతా 2లో...

భారత్ సమ్మిట్ వేదికగా
దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారు



- రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్

హైదరాబాద్: కొందరు విదేశీయులను భారత్‌కు రప్పించి, దేశ ప్రధాని, ప్రజాస్వామ్యంపై అంతర్జాతీయంగా దేశ పరువు తీయాలని చూసిన రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. అటు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విదేశీయుల ప్రాంతీయ నమోదు కార్యాలయం ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీని మళ్లీ రాజకీయంగా నిలబెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ, వారి కూటమి విదేశీయుల సహాయం కోరుతోందని ఆరోపించారు.హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన

మిగతా 2లో...

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు
ప్రచారం కల్పించండి



హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్): ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 పోటీలకు తెలం గాణ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు అధికారులతో సచివాలయ ంలో సమావేశమయ్యారు. గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి. పలు సూచనలు తెలియజేశారు. కాగా. డిసెంబ ర్ 11 నుంచి 22 వరకు హైదరాబాద్‌తో పాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్,

మిగతా 2లో...

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

సంపాదకీయం

విమర్శించే జర్నలిస్టులపై కక్ష సాధింపులా?

- ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు..

విమర్శలను సహనంతో స్వీకరించాలి.. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు, అమలు చేసే విధానాలు, ప్రజలపై చూపే ప్రభావాలను విశ్లేషించి లోటుపాట్లను ఎత్తిచూపడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత. అధికారంలో ఉన్నవారు చేస్తున్న పనులను ప్రశంసించడమే కాకుండా, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న నిర్ణయాలను ప్రశ్నించడం కూడా జర్నలిజంలో అంతర్భాగం. ప్రజల గొంతుకగా నిలవాల్సిన మీడియా వ్యవస్థ స్వతంత్రంగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది. అలాంటి జర్నలిస్టులపై ఆంక్షలు విధించడం, వారి విమర్శలను సహించలేకపోవడం, ప్రశ్నించే స్వరాలను అణచివేసే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.ప్రభుత్వ విధానాలను విమర్శించే జర్నలిస్టులను శత్రువులుగా చూడటం సరైన పద్ధతి కాదు. ప్రభుత్వాలు ప్రజల ఓట్లతో అధికారంలోకి వస్తాయి. ప్రజల కోసం పనిచేయాల్సిన బాధ్యత వాటిపై ఉంటుంది. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. పాలకుల నిర్ణయాల్లో తప్పులు ఉన్నప్పుడు వాటిని ఎత్తిచూపడం, ప్రజలకు కలిగే నష్టాలను వివరించడం, అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించడం జర్నలిస్టుల వృత్తిపరమైన ధర్మం. విమర్శలు వచ్చినప్పుడు వాటికి సమాధానం చెప్పడం మానేసి విమర్శకులపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు.**విమర్శలను సహించే ప్రజాస్వామ్యమే బలమైనది**ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షానికి, పౌర సమాజానికి, మీడియాకు సమాన ప్రాధాన్యత ఉంటుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం సహజం. ఆ అభిప్రాయాలను వినడం, వాటిలోని వాస్తవాలను పరిశీలించడం, అవసరమైతే నిర్ణయాలను సవరించుకోవడం పాలకుల బాధ్యత. విమర్శించే వారిని రాజకీయ ప్రత్యర్థులుగా ముద్రవేయడం, వారి ఉద్దేశాలను తప్పుగా చిత్రీకరించడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. పైగా ప్రజల్లో ప్రభుత్వంపై అనుమానాలు పెరుగుతాయి.ప్రభుత్వ విధానాలను విమర్శించడం అంటే దేశాన్ని విమర్శించడం కాదు. పాలకుల నిర్ణయాలను ప్రశ్నించడం అంటే దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం కాదు. ప్రభుత్వం, దేశం రెండూ వేర్వేరు అంశాలని గుర్తించాలి. దేశం పట్ల ప్రేమ, రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్నవారే ప్రభుత్వ విధానాల్లోని లోపాలను ఎత్తిచూపవచ్చు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేకపోతే పాలకుల నిర్ణయాలను పరిశీలించే అవకాశం ఉండదు. అందువల్ల విమర్శలను దేశ వ్యతిరేక చర్యలుగా చిత్రీకరించే ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం.**భారత్ సమ్మిట్ చుట్టూ వీసాల వివాదం**హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్-2026 సందర్భంగా విదేశీ ప్రతినిధుల వీసాల వ్యవహారం వివాదానికి దారితీసింది. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వివిధ దేశాల నుంచి మేధావులు, పరిశోధకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు హాజరుకావాల్సి ఉంది. అయితే ఆహ్వానాలు అందుకున్న కొందరు విదేశీ ప్రతినిధులకు వీసాలు నిరాకరించడం, మరికొందరికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.శశిథరూర్ వెల్లడించిన వివరాల ప్రకారం 315 మంది వక్తల్లో 115 మంది భారత్‌కు రాలేకపోయారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రతినిధులు సదస్సుకు దూరమవడం సాధారణ పరిణామంగా తీసుకోవడానికి వీలులేదు. అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నప్పుడు ప్రతినిధుల రాకపోకలకు సంబంధించిన అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ముందస్తు సమన్వయం అవసరం. వీసాల మంజూరు, నిరాకరణ, రద్దు వంటి అంశాల్లో స్పష్టత ఉండాలి. విదేశీ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన తర్వాత చివరి నిమిషంలో అనుమతులు నిరాకరించబడితే నిర్వాహకులకు ఇబ్బందులు కలగడమే కాకుండా దేశ ప్రతిష్ఠపైనా ప్రభావం పడుతుంది.విదేశీయులకు వీసాలు మంజూరు చేయడం, నిరాకరించడం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే ఆ నిర్ణయాలు పారదర్శకంగా, సరైన కారణాలతో ఉండాలి. ఇప్పటికే అనుమతులు పొందిన వ్యక్తుల వీసాలను రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే అందుకు తగిన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. భద్రతాపరమైన అంశాలను బహిర్గతం చేయాల్సిన అవసరం లేకపోయినా, నిర్ణయాల వెనుక ఉన్న సాధారణ కారణాలను వెల్లడించడం ప్రజాస్వామ్య జవాబుదారీతనంలో భాగం.**ప్రశ్నించినందుకే జర్నలిస్టులపై ఆంక్షలా?**ఈ వివాదంలో నార్వేకు చెందిన జర్నలిస్టు హెలె లింగ్ స్వెండ్సన్ పేరు ప్రస్తావనకు వచ్చింది. 2026 మేలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారా అని ఆమె ప్రశ్నించిన అంశం కూడా చర్చలోకి వచ్చింది. ఒక జర్నలిస్టు దేశ ప్రధానమంత్రిని ప్రశ్నించడం తప్పెలా అవుతుంది? ప్రజాస్వామ్య దేశంలో అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తులను కూడా మీడియా ప్రశ్నించగలగాలి. పాలకులు తమ నిర్ణయాలు, విధానాలు, ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానాలు చెప్పాలి. ఇదే ప్రజాస్వామ్యానికి అసలైన స్ఫూర్తి.జర్నలిస్టులు అడిగే ప్రతి ప్రశ్నకు పాలకులు అంగీకరించాల్సిన అవసరం లేదు. ప్రశ్నల్లో తప్పులు ఉంటే వాటిని సరిదిద్దవచ్చు. ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే ఆధారాలతో ఖండించవచ్చు. కానీ ప్రశ్నించిన వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేయడం, వారి స్వేచ్ఛను పరిమితం చేసే చర్యలకు పాల్పడటం సరైన విధానం కాదు. ప్రభుత్వ విధానాలను విమర్శించినందుకు జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయనే అభిప్రాయం ఏర్పడితే అది అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రజాస్వామ్య ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది.పత్రికా స్వేచ్ఛ అనేది జర్నలిస్టులకు మాత్రమే సంబంధించిన హక్కు కాదు. ప్రజలకు సమాచారం తెలుసుకునే హక్కుతో అది ముడిపడి ఉంటుంది. ఒక వార్తను ప్రచురించే ముందు వాస్తవాలను పరిశీలించడం, అధికారుల నుంచి వివరణ తీసుకోవడం, బాధితుల వాదనలను ప్రజల ముందుంచడం మీడియా బాధ్యత. ప్రభుత్వాల తప్పిదాలను బయటపెట్టినప్పుడు ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి. అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం పెరుగుతుంది. అందువల్ల స్వతంత్ర మీడియా ప్రజాస్వామ్యానికి ఒక బలమైన రక్షణ కవచంగా పనిచేస్తుంది. **రాజకీయ విమర్శలకు ప్రతిగా ఆంక్షలు పరిష్కారం కావు**ప్రస్తుతం దేశంలో రాజకీయ వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. అధికార పక్షాలు, ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సాధారణమయ్యాయి.

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో విద్యుత్ కోతలు

భట్టి విక్రమార్క సూచించారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా ప్రణాళికలు సిద్ధం చేయాలని, అవసరమైన విద్యు త్‌ను ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. దావూద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేటలో కొత్తగా రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. విద్యుత్ డిమాండ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులు, ప్రజలు విద్యుత్ కోతల సమస్యను ఎదుర్కోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఎల్‌నినో ప్రభావంతో

మద్దతు ధరలకు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నామని స్పష్టం చేశారు. అన్నదాతలు తమ పంటలను జాగ్రత్తగా విక్రయించుకోవాలని సూచించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా సాగునీరు అందించగలిగామని వ్యాఖ్యానించారు. సత్తుపల్లికి ఏ ప్రాజెక్టు అడిగినా తాను మొదటి ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు.ఈ నియోజకవర్గానికి ఫుడ్ పార్క్, పామాయిల్ ఫ్యాక్టరీ, కిన్నెరసాని టూరిజం ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తానని మంత్రి తుమ్మల మాటిచ్చారు. బేతుపల్లి కాలువ ద్వారా వేంసూరు ప్రాంతంలోని చెరువులకు గోదావరి జలాలను అందించే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. అవసరమైతే అంగార ప్రాంతానికి కూడా గోదావరి నీటిని తీసుకువస్తానని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకురావడం తన రాజకీయ జీవిత లక్ష్యమని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాకు విమానాశ్రయం, భద్రాద్రికి రైల్వేలైన్ ఏర్పాటు చేయాలన్నది తన సంకల్పమని తెలిపారు. సత్తుపల్లి మీదుగా కొప్పూరు, పెనుబల్లి మీదుగా కొండపల్లి రైల్వేమార్గాల కోసం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.మార్కెట్ కమిటీ నిధులను తిరిగి ఆయా మార్కెట్లే ఖర్చు చేసుకునే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, సౌకర్యాలు కల్పించే బాధ్యత తనదని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సత్తుపల్లికి తీసుకువస్తానని మాటిచ్చారు. సీఎం చేతుల మీదుగా కల్లూరు గూడెం పామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభించాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నానని అన్నారు. అశ్వారావుపేటకు మంజూరైన పామాయిల్ ఫ్యాక్టరీని ఎమ్మెల్యే మట్టా రాగమయి విజ్ఞప్తితో కల్లూరు గూడెనికి మార్చామని స్పష్టం చేశారు.కల్లూరు గూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ రావడంతో ఇప్పటికే మూడు వేల ఎకరాల్లో పామాయిల్ సాగు ప్రారంభమైందని మంత్రి తుమ్మల ప్రస్తావించారు. మరో మూడువేల ఎకరాల్లో పామాయిల్ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. పామాయిల్‌తో పాటు కోకో, మకడామియా, వక్క, మిరియం వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతన్నలు దృష్టి సారించాలని సూచించారు. సత్తుపల్లి ప్రాంతంలో అధిక దిగుబడులు ఇచ్చే ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని అన్నారు. సత్తుపల్లి మార్కెట్ కమిటీకి అవసరమైన ఏ సౌకర్యమైనా కల్పించే బాధ్యత తనదని చెప్పారు. ఖమ్మం మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సత్తుపల్లి మార్కెట్ కమిటీని కూడా అభివృద్ధి చేసి అన్నదాతలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

ఇళ్లే పథకం లబ్ధిదారులకు తెలంగాణ సర్కార్

పేర్కొన్నారు.22 ఏ భూముల సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ అంశం రావడంతో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. సీఎం ఆదేశాలతో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యకు పరిష్కారం కలిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

భారత్ సమ్మిట్ వేదికగా

భారత్ సమ్మిట్ 2026 వేదికగా ఇటలీకి చెందిన వారితో భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ జాతీయ పార్టీ విభాగాల సహ సమన్వయకర్త ఎన్. విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. యూరోపియన్ సోషలిస్ట్ సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఢిల్లీలో విష్ణువర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 97 కోట్ల మంది ఓటర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్‌కు విదేశీ ప్రతినిధులు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా విదేశీ నేతలతో విమర్శలు చేపించిన కల్పించిన రాహుల్ గాంధీ, ఆ పార్టీ తక్షణమే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భారత్ సమ్మిట్‌కు హాజరైన విదేశీ ప్రతినిధుల పూర్తి వివరాలను బయటపెట్టాలని, వీసా నిబంధనల ఉల్లంఘన జరిగితే కేంద్ర అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.హైదరాబాద్: వరుస ఎన్నికల పరాజయాలతో తీవ్ర నిరాశలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీని రాజకీయంగా నిలబెట్టేందుకు, రీఎస్టాబ్లిష్ చేయడానికి విదేశీయుల సహాయం కోరుతోందని రాంచందర్ రావు ఆరోపించారు. భారత గడ్డను విదేశీయుల రాజకీయ జోక్యానికి వేదికగా మార్చే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని.. ప్రజాస్వామ్యంలో ప్రధాని మోదీని విమర్శిస్తే సహిస్తాం కానీ విదేశీయులతో భారత్ ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తే సహించేది లేదన్నారు. త్వరలో సంచలనాలంటూ సీఎం రేవంత్ సంకేతాలు.. ఫోన్ ట్యాపింగ్ నిరూపించడం సిట్‌కు సాధ్యమేనా ఇటీవల జరిగిన భారత్ సమ్మిట్‌లో రెచ్చగొట్టే రాజకీయ వ్యాఖ్యలు చేసిన విదేశీయుడు జియాకోమో ఫిలిబెక్‌పై విదేశీయుల ప్రాంతీయ నమోదు కార్యాలయం లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు

మహ బూబ్‌నగర్ ఐదు నగరాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు సుమారు 8 వేల మంది క్రీడాకారులు, ప్రతినిధులు రానున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో అన్నీ జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ జాజు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా.. గేమ్స్ నిర్వహణ నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. 'క్రీడలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా టార్చ్ ర్యాలీలు నిర్వహించాలి. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో విస్తృత ప్రచారం చేయాలి. హోర్డింగులు, మస్కట్, లోగోలను ఏర్పాటు చేయడం ద్వారా ఖేలో ఇండియా గేమ్స్‌కు ప్రచారం కల్పించాలి.క్రీడాకారులకు నాణ్యమైన వసతి, ప్రత్యేక రవాణా సౌకర్యాలు కల్పించాలి. పాఠశాల విద్యార్థులు, యువతను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలి. మహమ్మద్ అజారుద్దీన్ సహా ప్రముఖ క్రీడాకారులతో విద్యార్థులకు ప్రేరణ కల్పించాలి. ఖేలో ఇండియా విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి' అని సీఎస్ సంజయ్ జాజు అధికారులకు సూచనలు జారీ చేశారు.

రైతులకు ఎకరాకు రూ.25

కోరారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర చరిత్రలో రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని కవిత విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కరువు పరిస్థితులను ప్రస్తావించకపోవడం బాధాకరమని అన్నారు.ఇదిలా ఉండగా.. ఇంటర్ బోర్డు రద్దు అంశంపై త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కవిత వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మరోవైపు ఖైరవ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని, యాత్రను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.హరీశ్ రావు అవినీతిపై అన్ని ఆధారాలూ సీఎంకు అందజేస్తాం.మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుప కవిత మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఈ నెల 20న కోస్తాంధ్రను తాకనున్న

ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర వాయుగుండం క్రమంగా బలపడుతోందని, ఇవాళ సాయంత్రానికి ఇది తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపారు. గతంలో వచ్చిన అర్నబ్ తుపాను తరహాలోనే దీని తీవ్రత కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

రానున్న తుపాను ప్రభావం ప్రధానంగా అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ విభాగం అంచనా వేసింది. తుపాను కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సీఎం సూచించారు. గతంలో కేంద్ర బృందం చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని, వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

మా కుటుంబంపై ఎన్నో అవాస్తవ కథనాలు అల్లారు

సంబంధించిన విషయాలు పుస్తకంలో రాయడం తనకు చాలా కష్టంగా అనిపించిందని సోనియా గాంధీ అన్నారు. రాజీవ్ గాంధీతో బంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తన ప్రేమ గురించి వివరించారు. తన బాల్యంలో అయినా, రాజకీయ జీవితంలో అయినా ఎప్పుడూ డైరీ రాసుకోలేదని, కానీ ఇప్పుడు పుస్తకమే రాసినట్లు తెలిపారు. పుస్తకంలోని చాలా విషయాలు తన జ్ఞాపకాల నుంచే రాశానని సోనియా గాంధీ స్పష్టం చేశారు."నా కుటుంబం, నా అత్త గారు, నా భర్త, నా కుమారుడు, నా కుమార్తె, ఇంకా నా గురించి బయట ఎన్నో విషయాలు చెబుతుంటారు. అందులో చాలా వరకు వాస్తవానికి చాలా దూరంగా ఉంటాయి. మా నిజ జీవితాలకు, ఆ కథనాలకు ఏ మాత్రం సంబంధం కూడా ఉండదు. రాజకీయాల్లో ఉన్న నా సహచరులు, మిత్రులు కూడా ఇలాంటి అనుభవాలను ఎన్నో ఎదుర్కొని ఉంటారు. బాధ కలిగించే ఎన్నో అసత్యాలను మా చుట్టూ కూడా అల్లారు. అందుకే నా భావాలను, నా కుటుంబాన్ని నేను అర్థం చేసుకున్న తీరును ప్రజల ముందుంచడానికి ఈ పుస్తకం రాయడమే సరైన మార్గమని భావించాను. నా కథను కూడా వినడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారని ఆశిస్తున్నాను."– భారత మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్, జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటన.. విజయవాడలో

పరికరాలను స్వాధీనం చేసుకుంటామని సీపీ రాజశేఖర్ బాబు స్పష్టం చేశారు.విజయవాడలో నేడు రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. రామోజీరావు జయంతి సందర్భంగా తొమ్మిది మందికి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానుండగా.. గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గౌరవ అతిథులుగా పాల్గొననున్నారు. విజయవాడలోని డా.బి.ఆర్.అంబేద్కర్ కళావేదికలో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం మొదలుకానుంది. ఇందుకోసం అమిత్ షా పుణె నుంచి విజయవాడకు రానున్నారు.

తండ్రిపై దాడి.. న్యాయం కోసం కుమార్తెల ఆగ్రహం!

- పోలీసులు పట్టించుకోకపోవడంతో హోటల్‌కు వెళ్లి సిబ్బందిపై ఎదురుదాడి..

వారణాసిలో ఘటన కలకలం



హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఇద్దరు మహిళలు చేసిన హల్‌చల్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమ తండ్రిపై దాడి చేసిన హోటల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగకపోవడంతో ఆగ్రహించిన కుమార్తెలు నేరుగా హోటల్‌కు వెళ్లి సిబ్బందిపై ఎదురుదాడికి దిగారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో స్థానికంగా కలకలం రేగింది.వివరాల్లోకి వెళితే.. వారణాసిలోని ఓ హోటల్‌లో కొద్దిరోజుల క్రితం ఇద్దరు మహిళల తండ్రిపై అక్కడి సిబ్బంది దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. తమ తండ్రిపై జరిగిన దాడితో ఆవేదనకు గురైన కుమార్తెలు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించారు. జరిగిన ఘటనను వివరించి, బాధ్యులపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.అయితే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో బాధిత కుటుంబం తీవ్ర అసంతృప్తికి గురైంది. తమ తండ్రిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపోవడంతో ఇద్దరు కుమార్తెలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. న్యాయం కోసం పోలీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో చివరకు తామే నేరుగా రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నారు.ఈ క్రమంలో ఇద్దరు మహిళలు తమ తండ్రిపై దాడి జరిగిన హోటల్‌కు చేరుకున్నారు. అక్కడి సిబ్బందిని నిలదీస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారిపై ఎదురుదాడికి దిగడంతో హోటల్ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బందితో వాగ్వాదానికి దిగుతూ హల్‌చల్ చేశారు. ఈ పరిణామంతో అక్కడున్న వారు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. కొందరు ఈ ఘటనను తమ ఫోన్లలో చిత్రీకరించడంతో వీడియో సామాజిక మాధ్యమాల్లోకి చేరింది.**పోలీసుల తీరుపై ప్రశ్నలు**ఈ ఘటన పోలీసుల పనితీరుపై కూడా పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు వెంటనే స్పందించి, ఘటనకు సంబంధించిన వాస్తవాలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా దాడికి గురైన వ్యక్తికి న్యాయం జరిగేలా చూడటం పోలీసుల బాధ్యత. ఫిర్యాదుపై సరైన స్పందన లేకపోతే బాధితుల్లో అసహనం పెరిగి ఇలాంటి పరిణామాలకు దారితీసే అవకాశం ఉంటుంది.చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు. అయితే బాధితులు పోలీసులను ఆశ్రయించినప్పటికీ న్యాయం అందలేదనే భావన కలిగితే అది ప్రజల్లో వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. అందువల్ల ఈ ఘటనలో అసలు ఏం జరిగింది? హోటల్ సిబ్బంది ఎందుకు దాడికి పాల్పడ్డారు? బాధితుల ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.**సోషల్ మీడియాలో వైరల్‌గా వీడియో** ఇద్దరు మహిళలు హోటల్‌కు వెళ్లి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

ఆధునీకరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం

- బుర్ర శ్రీనివాస్ గౌడ్
- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు



హనుమకొండ, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్) : కల్లు గీత వృత్తిని ఆధునికరించాలని, బెల్ట్ షాప్ లను నియంత్రించి వాటికి మద్యం సరఫరా చేస్తున్న వైన్ షాపులను గుర్తించి లైసెన్స్ రద్దు చేయాలని తెలంగాణ కల్లుగీతా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తరతరాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా ప్రాణాలు పణంగా పెట్టి వృత్తిని కొనసాగిస్తున్నామని, ప్రపంచం ఆధునీరణ వైపు వెళ్తుంటే గీత వృత్తి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి లాగే అక్కడే ఉందని, అమృతం లాంటి ఔషధ గుణాలున్న నీరా, కల్లు, తాటి ఉత్పత్తులను ప్రోత్సహించకుండా ప్రాణాలు బలిగొంటున్న మద్యంను ప్రోత్సహిస్తూ, గీత వృత్తినే కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు గుడుంబా సమయం నుండి గీత వృత్తికి ఆదరణ లేక వేలాది కుటుంబాలు పట్టణాలకు వలస వెళ్లి డ్రైవర్లుగా, వాచ్మెన్ లుగా జీవనం సాగిస్తున్నారని ఆందోళన చెందుతూ తక్షణమే ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు వేళపాళ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరుపుతూ గీత వృత్తిని నాశనం చేస్తున్నారని, ఈ బెల్ట్ షాప్ ల వలన నేరాల రేటు అధికమవుతుందని, కల్తీకి ఎక్కువ అవకాశం ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి బెల్ట్ షాపులను కట్టడి చేసి వాటికి మద్యం సరఫరా చేస్తున్న వైన్ షాపుల లైసెన్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏటా లక్ష తాటి, ఈత, ఖర్జూర,గిరక మొక్కలు పెంచి ప్రభుత్వమే సొసైటీలకు అందించి వాటిని సంరక్షించి వృత్తి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. గీత వృత్తి ఆధునీకరణకు చర్యలు చేపట్టకపోతే గ్రామ గ్రామాన ధర్నా రాస్తారోకో లు నిర్వహించి, ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రంజిత్ కుమార్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు వల్లాల గంగాధర్ గౌడ్, మోటపోతుల రాజు గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు కాసగోని రవి గౌడ్ మంజ విజేందర్ గౌడ్ చింత మధు గౌడ్, చిర్ర పైడాద్రి గౌడ్, ఆరెళ్లి రమేష్, కాసగోని మొగిలి, చింత కుమారస్వామి, గీతకార్మికులు పాల్గొన్నారు.

నిరుపేద సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం ..!!

- రాష్ట్రంలో కొత్తగా 4 లక్షల 63 వేల మందికి చేయూత పింఛన్లు
- శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి





మేడ్చల్ జిల్లా, బోడుప్పల్, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్) :రాష్ట్రంలో ప్రతి నిరుపేద సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా విధానాలు సాగుతున్నాయని శాసనమండలి ప్రభుత్వం చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నరాష్ట్రంలో కొత్తగా 4 లక్షల 63వేల మందికి చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. మేడ్చల్ ని యోజకవర్గం లో ని బోడుప్పల్ ఎస్ ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్, ఘట్ కేసర్ సర్కిల్ బంధన్ ఫంక్షన్ హాల్ లో కొత్తగా మం జూరైన చేయూత పింఛన్ల ను పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన శాసన మండలి ప్రభుత్వం చీఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, కలెక్టర్ మనూ చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కమీషనర్ విజయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమీషనర్ రాధిక గుప్తా తదితరులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎన్నో ఏళ్ళు అనంతరం ఎదురుచూస్తున్న 4 లక్షల 63 వివిధ రకాల చేయూత పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఇది ప్రభుత్వ సంక్షేమానికి నిదర్శనం అని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం ప్రతీ నెలా రూ. 114 కోట్లు బాధితుల కోసం భరిస్తుందన్నారు. మేడ్చల్ జిల్లాలో కొత్తగా 25,553 చేయూత పింఛన్లు మంజూరవగా నియోజకవర్గం 6,681 చేయూత పింఛన్లు మంజూరైనట్లు మహేందర్ రెడ్డి వివరించారు. ఇవే కాకుండా నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళను పంపిణీ చేస్తుందని మహేందర్ రెడ్డి చెప్పారు. ఉచిత బస్సులతో మహిళలందరికీ గౌరవంగా రాష్ట్రమంతా తిరిగేలా అవకాశం కల్పించిందని మహేందర్ రెడ్డి అన్నారు. కొత్త రేషన్ కార్డులు, రూ. 500 కే వంట గ్యాస్ అందించడం లాంటి సంక్షేమ పథకాలు ప్రతి నిరు పేదకు చేరిందని మహేందర్ రెడ్డి వెల్లడించారు.మేడ్చల్ ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏదైనా పేదల సంక్షేమం కోసం కృషి చేసిదై ఉండాలని అన్నారు. మేడ్చల్ పరిసర ప్రాంతాలలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 150 కోట్లు అందించినట్లు వివరించారు. రాజకీయాలలో పదవులు శాశ్వతం కాదని సంక్షేమం శాశ్వతం అని అన్నారు. రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంమైన పేదల కోసం తపించాల్సిందేనని చెప్పారు. ఇంకను పెన్షన్ అందని వారందరికీ పెన్షన్ కల్పించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ని నెర వేర్చుకునేలా పెన్షన్ 4000 అందించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతిపక్షాలను కలుపుకొని పోవాలని అన్నారు. కలెక్టర్ మనూ చౌదరి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేలా తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు.

మల్లాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలి

- పార్టీలకు అతీతంగా గ్రామస్తులంతా ఐక్యంగా ఉద్యమించాలి.. మాజీ కౌన్సిలర్ కేశవరం ఆంజనేయులు పిలుపు





మల్లాపూర్, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):మల్లాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 109లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానిక గ్రామస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ కౌన్సిలర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశవరం ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు న్యాయం జరగాల్సిన ఇళ్లను ఇతర ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తున్నారనే ఆందోళన గ్రామస్తుల్లో నెలకొందని ఆయన పేర్కొన్నారు.ఎన్నో ఏళ్లుగా మల్లాపూర్ గ్రామస్తులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం పోరాటం చేస్తున్నారని, వారి చిరకాల ఆకాంక్ష నెరవేరాల్సిన తరుణంలో స్థానికులకు అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడటం బాధాకరమని అన్నారు. గ్రామస్తులు ఇప్పటికైనా మేల్కొని తమ హక్కుల పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇది చివరి అవకాశంగా భావించి మిగిలిన ఇళ్లనైనా అర్హులైన స్థానికులకు దక్కేలా సమిష్టిగా కృషి చేయాలని కోరారు.గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సర్వే నంబర్ 19లోని భూమిని వేలం వేయడానికి ప్రయత్నించిన సమయంలో గ్రామస్తులు ఐక్యంగా అడ్డుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అప్పట్లో పార్టీలకు అతీతంగా గ్రామ ప్రయోజనాల కోసం నాయకులు, ప్రజలు కలిసికట్టుగా పోరాడారని తెలిపారు.అదే స్ఫూర్తితో ప్రస్తుతం కూడా రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఒకే వేదికపైకి రావాలని సూచించారు. వ్యక్తిగత రాజకీయాలకు, పార్టీల విభేదాలకు తావులేకుండా గ్రామ ప్రయోజనాలే లక్ష్యంగా ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు.మల్లాపూర్ గ్రామస్తుల హక్కులను కాపాడుకోవడానికి ఇదే సరైన సమయమని, మిగిలిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానిక అర్హులకే న్యాయం జరిగేలా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కేశవరం ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. గ్రామ ఐక్యతకు మద్దతు తెలిపే వారందరూ ముందుకు వచ్చి ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్ జిల్లా, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్) : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ,హౌజింగ్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 103 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్కాడ సర్కిల్ పరిధిలోని సమస్యలపై ఎస్సీకి వినతి పత్రం అందజేసిన యూనియన్ సభ్యులు



హైదరాబాద్, నవంబర్ 16(నమస్తే హైదరాబాద్): తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎల్ర క్టిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ స్కాడ సర్కిల్ కమిటీ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో సోమవారం స్కాడ ఎస్సీ గారిని మర్యాదపూర్వకంగా కలిసి సర్కిల్ పరిధిలోని సమస్యలపై వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని సమస్యలపై ఎస్సీ గారితో చర్చించడం జరిగింది. ఎస్సీ గారు స్పందించి సమస్యలన్నిటి పైన సుదీర్ఘంగా చర్చించి సాధ్యమైనంత తొందరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు .అదేవిధంగా సాస యాప్ గురించి కూడా చర్చించిన అనంతరం రెండు నెలల్లో మీ సమస్య పరిష్కారం చేస్తాం అని హామీ ఇవ్వడం జరిగింది .మరియు యాడ్ క్లీనింగ్ విషయంలో కూడా సెక్షన్ స్థాయిలో ఏ ఈ లకు ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చి క్లీనింగ్ చేపిచ్చే వి ధంగా చర్యలు తీసుకుంటామని తెలియ జే శారు. ఈ కార్యక్రమంలో స్కాడా సర్కిల్ కమిటి ప్రెసిడెంట్ జె.బస్వరాజు, సెక్రటరీ టి.వెంకన్న మరియు కమిటీ
సభ్యులు పాల్గొన్నారు.

అభినవ్ కంటి వైద్య కేంద్రాన్ని ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





ఉప్పల్, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్): ఉప్పల్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీలో బోడ్రాయి దేవాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభినవ్ కంటి వైద్య కేంద్రాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి ల క్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.
అనంతరం అభినవ్ కంటి వైద్య కేంద్రం వ్యవస్థాపకులు, నిర్వాహకులు డాక్టర్ వేణు గోపాల్ రావు అప్పానికి శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, వైద్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ రెడ్డి నగర్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం.. అధికారులను వెంటనే స్పందింపజేసిన ఆకారపు అరుణ్ పటేల్



వెంకట్ రెడ్డి నగర్, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):వెంకట్ రెడ్డి నగర్‌లో గత కొన్ని రోజులుగా తాగునీటి పైపులైన్‌లోకి డ్రైనేజీ నీరు కలుస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. కలుషిత నీటి సరఫ రాతో ప్రజలు ఆందోళనకు గురవుతున్న నేప థ్యంలో సమస్యను పరిష్కరించాలని స్థానికులు సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకె ళ్లారు.ఈ విషయంపై వెంటనే స్పందించిన ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ సంబంధిత అధికారులను పిలిపించి, సమస్య తీవ్రతను పరిశీలించారు. తాగునీటి పైపులైన్‌లో డ్రైనేజీ నీరు కలుస్తున్న సమస్యను తక్షణమే పరిష్క రించి, కాలనీవాసులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమస్య పరిష్కారానికి చొరవ చూపడంతో స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఆకారపు అరుణ్ పటేల్‌కు ప్రత్యేక కృతజ్ఞ తలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సం దర్భంగా ఆయన పేర్కొన్నారు.

ధరణి కాలనీ సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేత



మేడిపల్లి (నమస్తే హైదరాబాద్) :మేడిపల్లి డివిజన్ పరిధిలోని ధరణి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈరోజు కాలనీవాసులు జోనల్ కమిషనర్ గారికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి కాల నీవాసులతో కలిసి సమస్యలను కమి షనర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ వాసుల వినతిపై వెం టనే స్పందించిన జోనల్ కమిషనర్ సమస్యల పరిష్కారానికి అవసరమైన పనులను మంజూరు చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చంద్రశేఖర్ చింతం,జనరల్ సెక్రటరీ బీమిడి శ్రీనివాస్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, శేఖర్ గౌడ్, సతీష్, అయిలయ్య యాదవ్, మహేశ్వరప్ప, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నంగి దేవేందర్ రెడ్డి నియామకం

- పార్టీ తనపై ఉంచిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తా.. కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తా





హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర అధికార ప్రతినిధిగా నంగి దేవేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనకు రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానికి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పదవిని కేవలం ఒక హోదాగా కాకుండా, కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వహిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల గొంతుకగా నిలబడి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నంగి దేవేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

బాలల సమస్యల పరిష్కారానికి బాలల ప్రజావాణి కార్యక్రమం

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్): మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న బాలల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో బాలల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాలలు తమ సమస్యలు, అవసరాలు, హక్కులకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువస్తూ మొత్తం 37 ఫిర్యాదులను అందాయని, ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి సమక్షంలో బాలలు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా బాలలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ నుంచి చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ (జజ×)లో ఉంటున్న దివ్యాంగ పిల్లలకు మరియు మానసిక వికలాంగుల పిల్లలు నివసిస్తున్న సంస్థల వద్దనే ప్రత్యేక సదరం క్యాంపులు నిర్వహించి, సదరం ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, అర్హులైన దివ్యాంగ పిల్లలకు చేయూత పింఛన్లు అందించాలని కోరారు.అలాగే పిల్లల ఆరోగ్య సమస్యలకు సంబంధించి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆధార్ నమోదు సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఆధార్ ఎన్రోల్మెంట్ చేసినప్పటికీ ఆధార్ కార్డులు జనరేట్ కాకపోవడం, ఆధార్ దరఖాస్తులు తిరస్కరణకు గురికావడం, వేలిముద్రలు సరిగా నమోదు కాకపోవడం, పలుమార్లు దరఖాస్తు చేసినా ఆధార్ కార్డులు అందకపోవడం వంటి సమస్యలను వివరించారు.

అదేవిధంగా అనాథ పిల్లలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, అర్హులైన పిల్లలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యకు సంబంధించి పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు తాగునీరు, ఆటస్థలాలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.క్రీడలకు సంబంధించిన సమస్యలపై జెడ్పీహెచ్ఎస్ ఆర్వీ కాలనీకి చెందిన విద్యార్థులు తమ పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి, అక్కడ తమ సామగ్రిని ఉంచడం వల్ల పిల్లలకు ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని డిఆర్ఓకు ఫిర్యాదు చేశారు. వెంటనే క్రీడా ప్రాంగణాన్ని పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇతర ఫిర్యాదుల్లో బాలల భద్రత, విద్యా అవకాశాలు, బాలల హక్కుల పరిరక్షణ, అనాథ మరియు నిరుపేద పిల్లలకు ప్రభుత్వ సహాయం, సంక్షేమ పథకాల అమలు, పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలు ఉన్నాయి.

ఈ సందర్భంగా అధికారులు బాలలు సమర్పించిన ఫిర్యాదులను సావధానంగా విని, ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యతతో పరిష్కరించాలని, బాలల హక్కులను కాపాడటంతో పాటు వారికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ రాజారెడ్డి, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు రామ్మోహన్, నాగ జయశ్రీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో బాలలు పాల్గొన్నారు.

రామ్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ నియామకాలు



- జనరల్ సెక్రటరీగా గడ్డం వెంకట్ సాయి, కోశాధికారిగా పుట్ట కృష్ణ నియామకం

రామంతపూర్, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):రామంతపూర్‌లోని రామ్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ నియామకాలు చేపట్టింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఇడిగి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా గడ్డం వెంకట్ సాయిని, కోశాధికారిగా పుట్ట కృష్ణను నియమించారు. అధ్యక్షుడు ఇడిగి సత్యనారాయణ గౌడ్ వారి నియామక పత్రాలను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పెంటవెల్లి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చారి, గొట్టిగ సిద్దిరాజు, దేవాలయ ప్రెసిడెంట్ నాగరాజు యాదవ్, కొండల్ రావు, నందికంటి శివ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సభ్యులు కాలనీ అభివృద్ధికి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల మెరుగుదలకు సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కాలనీ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా వెల్ఫేర్ అసోసియేషన్ మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

యువత దిశ మారితే.. దేశ దశ మారుతుంది



- దేశ భవిష్యత్తుకు యువతే వెన్నుముక.. యువశక్తితోనే నవభారత నిర్మాణం..
- యువతలోని ప్రతిభను వెలికితీసి సమాజాభివృద్ధికి వినియోగించాలి
- ఈ నెల 22న హైదరాబాద్‌లో భారీ యువజన సమ్మేళనం
- సిద్దిపేటలో సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించిన ఆదర్శ యువజన ఉద్యమ సభ్యులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):
దేశ ప్రగతికి యువతే చోదకశక్తి, దేశ భవిష్యత్తుకు యువతే వెన్నుముక, యువత సరైన మార్గంలో పయనిస్తేనే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని ఆదర్శ యువజన ఉద్యమం (ఐవైఎం) తెలంగాణ సభ్యులు వహీద్, అబ్దుల్ ఖుద్దుస్ అన్నారు. యువతలో అపారమైన ప్రతిభ, అద్భుతమైన ఆలోచనా శక్తి, సాధించాలనే పట్టుదల ఉన్నాయని, వాటికి సరైన దిశానిర్దేశం కల్పిస్తే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తిగా యువత ఎదుగుతుందని పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి యువతే రేపటి దేశ నిర్మాతలని, యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. అయితే నేటి పోటీ ప్రపంచంలో కొందరు యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాల వినియోగానికి, జూదానికి, అంతర్జాల మోసాలకు ఆకర్షితులవుతూ తమ అమూల్యమైన జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువ తను అటువంటి అనర్థాల నుంచి దూరం చేసి, మంచి ఆలోచనలు, ఉన్నతమైన ఆశ యాలు, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన జీవితాన్ని గడిపేలా చైతన్యపరచడమే తమ ఉద్యమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారి నైపుణ్యాలను సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దేందుకు ఆదర్శ యువజన ఉద్యమం కృషి చేస్తోందన్నారు. లక్ష్యం లేని జీవితం దిక్కుతోచని ప్రయాణంతో సమానమని, లక్ష్యంతో కూడిన జీవితం విజయానికి బాటలు వేస్తుందని వారు పేర్కొన్నారు. యువత తమ శక్తి సామర్థ్యాలను గుర్తించి, చెడు మార్గాలకు దూరంగా ఉంటూ విద్య, విజ్ఞానం, సేవాభావం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నేరాలు లేని సమాజం, బాధ్యతాయుతమైన యువత, శాంతియుతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఈ నెల 22న హైదరాబాద్‌లో ఆదర్శ యువజన ఉద్యమం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మేళనం ద్వారా యువతకు సమాజం పట్ల బాధ్యత, జీవిత లక్ష్యాల పట్ల స్పష్టత, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ నలుమూలల నుంచి యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం యువజన సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖుద్దుస్, వహీద్, హాజీ సిద్దిక్, అతిఫుద్దీన్, హబీబుద్దీన్, అమీర్, మిస్కిన్, మొహమ్మద్ కరీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో రూ.57 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హెచ్ఎంటీ నగర్, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):
ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో రూ.57 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక భరోసా నాయకుడు సాయిజెన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఆయా కాలనీల ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులను చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మొత్తం నాలుగు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వాటిలో రూ.10 లక్షల వ్యయంతో సాయినగర్ నుంచి రత్నానిధి అపార్ట్‌మెంట్‌కు వెళ్లే రహదారి నిర్మాణం, రూ.22 లక్షలతో రాఘవేంద్ర నగర్‌లో ఉస్మాన్ ఇంటి వైపు రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. అదేవిధంగా రూ.10 లక్షల వ్యయంతో రాఘవేంద్ర నగర్ నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే మార్గంలోని గ్యాస్ అంజి రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.15 లక్షలతో బుడగ జంగాల స్మశాన వాటికలో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నారు.ఈ పనులు పూర్తయితే స్థానిక కాలనీల ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడటంతో పాటు మౌలిక వసతుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఈ సాయి పృథ్వి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బుడగ జంగాల కుల పెద్దలు, కాలనీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంజూరైన అభివృద్ధి పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్



చిల్కానగర్, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):చిల్కానగర్ డివిజన్ పరిధిలో మంజూరై, ఎమ్మెల్యే మరియు కార్పొరేటర్ చేతుల మీదుగా శంకుస్థాపనలు పూర్తయిన అభివృద్ధి పనులను ఇప్పటికీ ప్రారంభించని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డ, చిల్కానగర్ ప్రాంతాల్లో మంజూరైన పలు అభివృద్ధి పనులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రారంభానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లికార్జున నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై సుమారు తొమ్మిది నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అదేవిధంగా చిల్కానగర్ ప్రధాన రహదారిపై చేపట్టాల్సిన 1000 ఎంఎం డయా ట్రంక్ లైన్ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేశారని, వాటిని వెంటనే పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఆదర్శనగర్ జనరల్ గ్రేవ్‌యార్డులో అభివృద్ధి పనులు గత మూడు సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్నాయని, పనులు పూర్తికాకపోవడంతో స్మశానవాటికలో కనీస మౌలిక సదుపాయాలు లేక డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రేవ్‌యార్డ్ కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త కాంట్రాక్టర్ ద్వారా పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ వినతిపై జోనల్ కమిషనర్ రాధిక గుప్తా వెంటనే స్పందించారు. వర్క్ ఆర్డర్లు తీసుకున్నప్పటికీ పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లతో పాటు, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్సీ సురేష్ కుమార్, డీఈ వెన్నెల గౌడ్‌లను ఆదేశించారు.మంజూరైన అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రారంభమై, ప్రజలకు త్వరితగతిన ప్రయోజనం చేకూరేలా అధికారులు పర్యవేక్షించాలని ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కోరారు.

ఇందిరానగర్ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించిన టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

- నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి: బన్నాల ప్రవీణ్ ముదిరాజ్



బీరప్పగడ్డ, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో సుమారు రూ.15 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కాలనీ అధ్యక్షుడు ముద్దం శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి, అసోసియేషన్ సభ్యులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని కాలనీ అధ్యక్షుడు ముద్దం శ్రీనివాస్ యాదవ్, అసోసియేషన్ సభ్యులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే సమయంలో స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.అదేవిధంగా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్, కాలనీ సభ్యులు బాలయ్య, సంజీవ, ఆజాద్, నాగేష్, రాజుగౌడ్, వెంకటేష్, కాంట్రాక్టర్ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్య ది గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి న్యూస్ : సూర్య ది గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను 'ఏకత్వం' థీమ్తో మాదాపూర్ లోని శిల్పకళా వేదికలో ఘనంగా నిర్వహించారు. వార్షిక వేడుకలకు విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎస్ నర్సింగ్ రావు, ఎంజీ గోపాల్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2026-27 విద్యా సంవత్సరంలో కళలు, క్రీడలు, సాహిత్య రంగాల్లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల కృషి చేస్తోందని యాజమాన్యం పేర్కొంది. అనంతరం వేడుకల్లో భాగంగా విద్యార్థులు సంగీతం, నృత్యం, నాటక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ రావు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు బీ దామోదర్రావు, వ్యవస్థాపక ట్రస్టీ బీ నర్సింగ్రావు, చైర్మెన్ బీఏ లక్ష్మీ ధరిత్రి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు..

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

సిద్దిపేటపై కాంగ్రెస్ ప్రభుత్వానిది వివక్షా పూరిత వైఖరి

- ఇచ్చిన హామీలు అమలు చేయాలి.. నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..
- మాజీ మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్ రావు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చడంపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో సమాధానం ఇచ్చామని అన్నారు. నీళ్లు లేని ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం కంటే నీళ్లు అందుబాటులో ఉన్న ప్రాంతానికి మార్చి రైతులకు మేలు చేసింది కేసీఆర్ ప్రభుత్వమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా కొత్త ప్రాజెక్టులు నిర్మించలేదని, కొత్తగా ఒక్క ఎకరాకు కూడా సాగు నీరు అందించలేదని విమర్శించారు. కృష్ణా జలాల వినియోగంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ప్రజల పక్షాన బహిరంగ లేఖ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గతంలో సిద్దిపేటకు వచ్చినప్పుడు రైతులకు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేస్తామని ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరలేదని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22,819 మంది రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. సిద్దిపేటకు మంజూరైన పశువైద్య కళాశాలను కొడంగల్‌కు తరలించారని, ఔటర్ రింగ్ రోడ్డు, వ్యవసాయ కళాశాల, శిల్పారామం, క్రీడా మైదానం, మహిళా గురుకుల పాఠశాల తదితర అభివృద్ధి పనులను నిలిపివేశారని విమర్శించారు. సుమారు రూ.1,070 కోట్ల విలువైన పనులకు సంబంధించిన నిధులు విడుదల చేసి పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు పెండింగ్ పరిహారం చెల్లించాలని, ఇర్కోడ్ ఎత్తిపోతల పథకం, గౌరవెల్లి, తపాస్‌పల్లి, కొండపోచమ్మ సాగర్ కాలువల పనులు పూర్తి చేయాలని కోరారు. వెయ్యి పడకల ఆసుపత్రి, రింగ్ రోడ్డు, నర్సింగ్ కళాశాల, ఆయుష్ ఆసుపత్రి తదితర పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుతో పాటు రూ.4 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, వడగళ్ల వానలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. సిద్దిపేట ప్రజలపై తన వ్యక్తిగత కక్షను చూపవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక ప్రాధాన్యతలు కోరడం లేదని, ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తి చేసి, నిధులు విడుదల చేయాలని మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ముఖ్యమంత్రి హోదా గౌరవాన్ని కాపాడుకోవాలని అన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



- ప్రతి అర్జీపై తీసుకున్న చర్యల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):
ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను తప్పని సరిగా నమోదు చేసి భద్రపరచాలని జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ అధికారులను ఆదేశించారు.సోమవారం సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించి మొత్తం 165 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లా డుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తారని, వారి అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలి ంచాలని సూచించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల స్వీకరణతోనే బాధ్యత ముగియదని, వాటిపై ఏయే చర్యలు తీసుకున్నారు, సమస్య ఏ దశలో ఉంది, పరిష్కారం కోసం చేసిన ప్రయ త్నాలు ఏమిటి, అనే వివరాలను స్పష్టంగా నమోదు చేసి భద్రపరచాలని సూచించారు. అదే విధంగా మండల, డివిజన్ స్థాయిల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాల్లో స్వీకరించిన దరఖాస్తులను కూడా పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ ఆదేశించారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు అందిస్తాం

- గజ్వేల్ నియోజకవర్గంలో 3,266 మందికి కొత్త పింఛన్ల మంజూరు, 390 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ
- ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





గజ్వేల్, / సయ్యద్ జహీర్ / నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):
సంవత్సరాల తరబడి కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా చేయూత పింఛన్లు అందిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతితో కలిసి సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన 3,266 మంది లబ్ధిదారులకు కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను, రెండో విడతలో 390 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హత కలిగిన వారెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

లి ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గజ్వేల్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మరో 2,000 ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో ఇళ్లు పొందిన లబ్ధిదారులు సొంతింటిలో సంతోషంగా జీవిస్తున్నారని చెప్పారు. దీపావళి సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపామని, కొత్త ఇంటిలో దీపాలు వెలిగించుకుంటున్న వారి ఆనందం చూస్తుంటే సొంతింటి కల నెరవేరిన సంతృప్తి కలిగిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందించామని వెల్లడించారు.

■ ప్రజలకు అండగా సంక్షేమ పథకాలు

200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి నెలకు సుమారు రూ.1,200 వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతోందని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు మూడేళ్లలో ప్రభుత్వం రూ.12 వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందిస్తున్నామని, అదనపు వైద్య ఖర్చుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,500 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని, పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాల పాలనలో పేరుకుపోయిన అప్పుల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఉందని, సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పులకు నెలనెలా భారీగా వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని మంత్రి పేర్కొన్నారు.

■ మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు.. యువతకు ఉపాధి..

జిల్లాలో మహిళా సంఘాలకు రూ.330 కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేశామని, వచ్చే ఏడాది నాటికి భవన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసి వివిధ విభాగాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, టామ్‌కామ్ ద్వారా విదేశాల్లోనూ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ నెల 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఐదు లక్షల ఇందిరమ్మ కుటుంబాల బీమా పథకాన్ని ప్రారంభించనున్నారని మంత్రి వెల్లడించారు.

■ అభివృద్ధికి సహకరించాలి.. ఎమ్మెల్సీ యాదవరెడ్డి..

ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ గతంలో వితంతువులు, దివ్యాంగులకు మాత్రమే పింఛన్లు అందేవని, ప్రస్తుతం ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు కూడా పింఛన్లు అందించడం శుభపరిణామమని అన్నారు. అర్హులైన వారికి పింఛన్లు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

■ ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరం: కలెక్టర్ హైమావతి

జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు తగ్గుతున్నందున వరి సాగుకు దూరంగా ఉండాలని, ఒక ఎకరా వరి పంటకు అవసరమయ్యే నీటితో పది ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చని వివరించారు. రైతు వేదికల వారీగా వ్యవసాయ అధికారులు అనుకూలమైన పంటల సాగుపై రైతులకు సూచనలు, సలహాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో రూ.33 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం

- నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- పన్నులను పరిశీలించిన టిఆర్ఎస్ నాయకులు మేడల మల్లికార్జున గౌడ్



నాచారం, నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా నాచారం 21వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో రూ.33 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు మేడల మల్లికార్జున గౌడ్ కాలనీవాసులతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల నాణ్యతను పరిశీలిస్తూ, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీవాసులకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించి, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపడమే అభివృద్ధి పనుల ప్రధాన లక్ష్యమని తెలిపారు.గాంధీనగర్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ నిధులు కేటాయించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మేడల మల్లికార్జున గౌడ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టేకులపల్లి రామచంద్రరావు, మంగోలి శివ, గీడి గణేష్, అంజిరెడ్డి, గొల్లూరి ప్రభాకర్, యూసుఫ్, వాసు, సుమలత, జహంగీర్, అంజయ్య, సత్తిరెడ్డి, షాబుద్దీన్, రాజు, శివ తదితరులతో పాటు కాలనీ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

కలం కార్మికులకు ఆసరా అందించండి

- కలెక్టర్ కు వినతి పత్రం అందించిన జర్నలిస్టులు



జనగామ జిల్లా నవంబర్ 16:(నమస్తే హైదరాబాద్) :
ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఆసరా కల్పించాలని కోరుతూ జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను కోరారు. జర్నలిస్టుల కోసం జర్నలిస్టులు అనే నినాదంతో పెన్ను పన్ను పింఛను అంటూ జర్నలిస్టులు ఐక్యమై సోమవారం జనగామ ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘం నాయకుడు తిప్పారపు ఉపేందర్ మాట్లాడుతూ తరతరాలుగా జర్నలిస్టులుగా పనిచేసిన వారికి కనీస పింఛన్ సౌకర్యం కూడా దక్కలేదన్నారు పత్రిక మీడియా రంగంలో పనిచేస్తున్న ఎందరో జర్నలిస్టులు చాలిచాలని వేతనాలతో పని చేస్తున్నారని అన్నారు. కలం ముందుకు సాగితే కానీ కడుపునిండని దయనీయ పరిస్థితిలో జర్నలిస్టులు ఉన్న, ఏనాడు తమ కష్టాలను కన్నీళ్లను ఇతరులకు చెప్పుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చేరవేసి పరిష్కరించేందుకు కృషిచేసిన జర్నలిస్టుల జీవితాలు సమస్యల సుడిగుండంలో ఉన్నా యన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఎవరికీ చెప్పుకోలేక మదన పడుతున్న మహనీయులు జర్నలిస్టులని అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరి సమస్యలే తమ సమస్యలుగా భావించి పనిచేసిన జర్నలిస్టుల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమం కోసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పిస్తే కుటుంబాలు కడుపునిండా తిని కంటినిండా నిద్రపోతారని తెలిపారు. సమాజంలో అందరికీ ఇస్తున్నట్లుగానే జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పిస్తే జర్నలిస్టుల కుటుంబాలకు భరోసా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నప్పుడే జర్నలిస్టుల సంక్షేమం కోసం పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. జర్నలిస్టులందరూ సంఘాల కతీతంగా ఐక్యమై పింఛన్ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన వారిలో జర్నలిస్టులు కుంభం రమేష్ యాదవ్, బూస రమేష్ యాదవ్, భిక్షపతి సుంకరి, చిట్యాల స్వామి తదితరులు. పాల్గొన్నారు.

చీటకోడూర్ రామలింగేశ్వర దేవాలయంలో జనగామ యువకులచే సినిమా షూటింగ్ ప్రారంభోత్సవం

- క్లాప్స్ కొట్టి ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజిరెడ్డి



జనగాం జిల్లా(నమస్తే హైదరాబాద్)
:జనగామ పట్టణ మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి. జనగామ పట్టణానికి జిల్లాకు చెందిన యువకులు తెలంగాణ ప్రాంతంలో జనగామ ప్రాంతంలో 1990 సంవత్సరంలో నాటి సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులను ప్రజల జీవన విధానాన్ని ఆ కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు నిర్బంధం వాటి పరిష్కారానికి ప్రజల నిర్వహించిన హీరోచిత పోరాటాలు ఇతివృత్తాలను ముఖ్యమైన సంఘటనను ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జరిగిన కృషి కుటుంబ సంబం ధాలు త్యాగం అవినీతికి వ్యతిరేకంగా ఆనాడు యువకులు పోషించిన పాత్ర ప్రాతిపదికగా కల్పిత అంశాలను కొన్నింటిని తీసుకొని చిత్రం నిర్మిస్తున్నట్లు చిత్ర డైరెక్టర్ చాగంటి టింకు(జితేందర్) వివరించారు.
ఈకార్యక్రమానికి.ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి జనగామ మున్సిపల్ మూడోవాడు కౌన్సిలర్ బూడిద జ్యోతి క్లాప్స్ కొట్టి చిత్ర షూటింగ్ ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక దృక్కోణంతో జనగామ కు చెందిన యువకులు చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ విషయమని తెలంగాణలో జనగామ అంటే కవులు కళాకారులు సాహితీ వేత్తలకు పోరాటయోధులకు సామాజిక ఉద్యమ కారులకు నిలయమని అన్నారు జనగామ ప్రాంత చరిత్రను ప్రతిబింబించే విధంగా ఈ చిత్రం నిర్మాణం జరగడం ఎంతో గర్వించదగ్గ విషయమని ఈ కార్యక్రమం జయప్రదం కావడానికి దర్శక నిర్మాతలకు అందరూ సహకరించాలని సినిమా సక్సెస్ కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈప్రారంభోత్సవ కార్యక్రమంలో. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి సీనియర్ రిపోర్టర్ తిప్పారపు ఉపేందర్ డైలాగ్ రైటర్ ఉప్పునూతల మధు యాక్టర్ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్ మధు కన్నా కెమెరా డి ఓ పి క్రాంతి నీల యాక్టర్ జగన్ రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఎలుకట్టే జగన్నాథం రంగు రాజశేఖర్ పాత్రికేయులు రాజు గోపగోని వినయ్ జర్రిపోతుల పరుశురాం తదితరులు. పాల్గొన్నారు.



నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలించిన రాగం నాగేందర్ యాదవ్



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి న్యూస్ : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్, గోపినగర్‌లో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి బస్తీలో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. వాల్ టు వాల్ రోడ్ల నిర్మాణానికి ప్రజలు సహకరించి, రోడ్డుకు అడ్డుగా ఉన్న అరుగులు, ర్యాంపులను స్వచ్ఛందంగా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, బీమన్ శ్రీను, వెంకటయ్య, విజయ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి జలమండలి అధికారులతో ఎమ్మెల్యే గాంధీ సమీక్ష సమావేశం



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జలమండలి అధికారులను ఆదేశించారు. వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, డ్రైనేజీ సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలని సూచించారు. కాలనీల ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా ఖ+ణ, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ రాజ శేఖర్, సీజీఎం శ్రీనివాస్ రెడ్డి,జీఎం కృష్ణ, డీజీ ఎం నారాయణలు పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలి : సీఎంసీ కమిషనర్ జి.సృజన



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి న్యూస్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 32 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ సృజన వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించారు.ఈ మేరకు టౌన్‌ప్లానింగ్ శాఖకు సంబంధించి 26, ఇంజినీరింగ్‌కు 3, శానిటేషన్‌కు 2, ఎలక్ట్రికల్ శాఖకు ఒక ఫిర్యాదు అందింది. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ కేటాయించారు.అనంతరం ఫిర్యాదులపై సమీక్షించిన కమిషనర్.. అధికారులు ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించాలని అధికారులకు కమిషనర్ సూచించారు.

ముగిసిన పాదయాత్ర..



- కెసిఆర్ ని కలిసిన మల్లేష్ బృందం
- మల్లేష్ బృందానికి అభినందనలు

నమస్తే హైదరాబాద్ (ఎర్రవల్లి): తెలంగాణ తొలి సీఎం, టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మరోమారు అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ఉద్యమకారుడు నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ కట్టంగూరు మండల కల్మర గ్రామానికి చెందిన వాస్తవ్యుడు గుండాల మల్లేష్ చెరువుగట్టు క్షేత్రం నుండి ఎర్రబెల్లి వ్యవసాయ క్షేత్రం వరకు చేపట్టిన పాదయాత్ర సోమవారంతో ముగిసింది. పాదయాత్ర బృందం మల్లేష్ ఆధ్వర్యంలో కేసీఆర్ ను కలిసింది. తమ పాదయాత్ర తీరును మరియు నల్గొండ జిల్లాలోని సమస్యలను,ఈ సంద ర్భం గా వారు అధినేతకు వివరించారు. ఈ సం దర్భంగా పాదయాత్ర బృందాన్ని కెసిఆర్ అభినందించారు.

అన్ని రకాల వరి ధాన్యం కు 500 రూపాయలు బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలుపరచాలి

- రైతులు దళారుల మాటలు నమ్మి తక్కువకు అమ్ముకోవద్దు అని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు భరోసా ఇవ్వాలి



జనగాం జిల్లా దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్) : దేవరుప్పుల మండల పిఎసిఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఈ సంవత్సరం ఎల్ నీనో ప్రభావంతో రైతులు వరి నాట్లు చాలా తక్కువగా వేశారు. దానికి తోడు కరెంటు సరిగా లేక . వర్షాలు పడక పంటలు పూర్తిగా ఎండి పోయి రైతులు త్రీవ ఇబ్బందులకు గురయ్యారు. ఏదో కొద్ది గొప్ప పండిన వరి ధాన్యానికి కూడా ధర తక్కువగా ఉండటం వల్ల రైతుకు కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేయాలని కోరుతున్నాం. సన్న రకం తో సహా అన్ని రకాల వడ్లకు ప్రస్తుతం ఉన్న ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ చెల్లించాలని. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలి. ఈకొద్దిగా పండిన పంటకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ కల్పిస్తే రైతులకు ఎంతో కొంత ఆసరాగా ఉంటుంది. ఇప్పుడు వరి కోతలు ప్రారంభమయ్యాయి. కాబట్టి మిల్లర్లు, దళారులు కలిసి రైతుల పంటను అడ్డగోలుగా దోచుకోవడం జరుగు తుంది, బియ్యం రేట్లు డబల్ అయి కొండక్కాయి కానీ వడ్ల రేట్లు మాత్రం పెరుగుత లేవు. బియ్యం రేటు పెరిగినప్పుడు వడ్ల రేటు ఎందుకు పెంచట్లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. పంట తక్కువగా వచ్చింది కాబట్టి పండిన రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. చివరగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ముందస్తుగా స్పష్టమైన హామీ ఇవ్వాలని. దళారులు మాటలు నమ్మి తక్కువ రేటుకు వడ్లను అమ్ముకోవద్దని రైతులకు సూచించిన మండల పిఎసిఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్ రెడ్డి.

అర్హులందరికీ చేయూత పింఛన్లు అందిస్తాం

- దుబ్బాక నియోజకవర్గంలో 1,924 కొత్త పింఛన్ల మంజూరు
- 523 మందికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ





అక్బర్‌పేట-భూంపల్లి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని రామలింగేశ్వర గార్డెన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి దుబ్బాక నియోజకవర్గ లబ్ధిదారులకు సోమవారం కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 1,924 మంది వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను, మరో 523 మందికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందజేశారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సంవత్సరాల తరబడి కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం చేయూత పింఛన్లు అందిస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు కేటాయిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రెండు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ద్వారా ప్రతి నెలా అర్హులైన కుటుంబాలకు విద్యుత్ ఖర్చు ఆదా అవుతోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, ఈ పథకం అమలుకు మూడేళ్లలో రూ.12 వేల కోట్లను ఆర్టీసీకి అందించామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని, అదనపు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.2,500 కోట్లను మంజూరు చేశామని వివరించారు. దుబ్బాకకు రూ.2 వేల కోట్లతో సమీకృత గురుకుల పాఠశాల మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని, పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంపై గత ప్రభుత్వాలు భారీగా అప్పుల భారం మోపాయని, వాటిపై వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని అన్నారు. గతంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు రూ.36 వేల కోట్లతో ప్రణాళిక రూపొందించి, రూ.11 వేల కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో రూ.330 కోట్ల వడ్డీలేని రుణాలను మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఐదు లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించనున్నారని మంత్రి వెల్లడించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కొత్త పింఛన్ల మంజూరు చేయడం సంతోషకరమన్నారు. అర్హులైన వారందరికీ చేయూత పింఛన్లు అందించాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న చేనేత కార్మికులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, నియోజకవర్గంలోని కరువు మండలాలను ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయానికి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని చేయూత పింఛన్ల లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగునీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపెల్లి చంద్రం, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీరాం సంగీత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగింది
- పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం సిద్దిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కుటుంబం ఆస్తులను కూడబెట్టు కోవడం, దోచుకోవడం, దాచుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చిందని తీవ్రంగా విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయని పరిస్థితిని మనంకళ్లారా చూశామన్నారు. దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, దళిత బంధు పథకం విషయంలోనూ అర్హులకు అన్యాయం చేశారని విమర్శించారు. అంతేకాకుండా పేద దళితుల భూములను స్వాధీనం చేసుకుని ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్న చరిత్ర గత పాలకులదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేద ప్రజలకు కొత్త రేషన్ కార్డులు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీపై వంటగ్యాస్, రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రైతు భరోసా, వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

■ 19న ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

ఈ నెల 19వ తేదీన సిద్దిపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మైనంపల్లి హనుమంతరావు కోరారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సభ వేదికగా ఇంటింటికీ ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. కుటుంబానికి ఆధారమైన ఇంటి పెద్దకు అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా బీమా ద్వారా అండగా నిలవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా సాకి ఆనంద్ వ్యవహరించగా, చేనేత కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యులు సూర్యవర్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాడూరి శ్రీనివాస్ గౌడ్, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నంగునూరు, చిన్నకోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు దేవులపల్లి యాదగిరి, మీసం మహేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు సాకి బాల్ లక్ష్మి ఆనంద్, ఆలకుంట మహేందర్, రియాజ్, ఎల్లం యాదవ్, బుచ్చిరెడ్డి, సిద్దిపేట జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ తప్పెట శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేణుక, మాజీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, సిద్దిపేట పట్టణంతో పాటు చిన్నకోడూరు, నంగునూరు, నారాయణరావుపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ముఖ్యమంత్రి సభకు సర్వం సిద్ధం

- 16 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కట్టా హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / నవంబర్ 16 (నమస్తే హైదరాబాద్):ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నాగదేవత ఆలయం ముందు భాగంలోని నందాల వెంకటలక్ష్మి గార్డెన్ వెనుక, బైపాస్ రహదారి-చిన్నగుండవెల్లి రహదారికి ఆనుకొని సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. సోమవారం సభా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాక్టర్లు, డోజర్ల సహాయంతో సభా ప్రాంగణాన్ని చదును చేసే పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. మైదానం అంతటా పలుమార్లు నీటిని చల్లి దుమ్ము లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం చుట్టూ బారికేడ్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని, నీటిని చల్లే పనులు పూర్తయిన వెంటనే వేదిక నిర్మాణ పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైదానం చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలను ట్రాక్టర్లు, డోజర్లతో చదును చేసి వాహనాల పార్కింగ్‌కు అనువుగా తీర్చిదిద్దాలని, వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ హరికిరణ్, రహదారులు భవనాల శాఖ, మున్సిపల్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష ముగిసిన 3 వారాల్లోపే ఫైనల్ రిజల్ట్స్ - టీజీపీఎస్సీ నియామకాల్లో కొత్త సంస్కరణలు

హైదరాబాద్ :టీజీపీఎస్సీ నియామక ప్రక్రియలో కొత్త సంస్కరణలను అమలు చేస్తోంది. కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలు (సీబీఆర్?టీ) ముగిసిన మూడు వారాల్లోపే తుది ఫలితాలను విడుదల చేస్తోంది. నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి తుది నియామకాలు పూర్తయ్యే వరకు మొత్తం నియామక ప్రక్రియను గరిష్ఠంగా 6 నెలల్లోపు పూర్తి చేసేలా కమిషన్ ప్రణాళికాబద్ధంగా పని చేస్తోంది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత దరఖాస్తులు సమర్పించడానికి అభ్యర్థులకు ఒక నెల సమయం ఇస్తారు. పరీక్ష సన్నద్ధత కోసం రెండు నెలల సమయం కేటాయిస్తారు. పరీక్షా తేదీలను ప్రకటించిన 25 రోజుల్లోపు సీబీఆర్?టీ పరీక్షను నిర్వహిస్తారు.ఇక నుంచి పరీక్షలకు ఇదే పద్ధతిఇప్పటికే తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), రోడ్లు భవనాల శాఖలో చేపట్టిన నియామకాలకు ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేశారు. పీసీబీలో అసిస్టెంట్ సైంటిస్ట్ (ఎనలిస్ట్ గ్రేడ్-2) పోస్టుల కోసం గత నెల 24న సీబీఆర్?టీ పరీక్ష ముగిసింది. కేవలం మూడు వారాల్లోపే ప్రాథమిక కీ విడుదల చేసి, ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసి తుది ఎంపిక జాబితాను ప్రకటించారు. భవిష్యత్తులో నిర్వహించే అన్ని పరీక్షలకు ఇదే విధానాన్ని అనుసరిస్తామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు.ఎలాంటి వివాదాలు తలెత్తకుండా తగు జాగ్రత్తలుఒకే దశలో పరీక్షలు ఉండే నియామక ప్రక్రియలను మూడు నెలల్లోపు, రెండు దశల్లో పరీక్షలు ఉండే ప్రక్రియలను ఆరు నెలల్లోపు పూర్తి చేయాలనేది కమిషన్ లక్ష్యం. పరీక్ష ముగిసిన వెంటనే సమగ్రమైన ప్రాథమిక సమాధానాల కీని విడుదల



చేస్తారు. ప్రక్రియలో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. పరీక్షలు కంప్యూటర్ ఆధారితం (సీబీఆర్?టీ) కావడంతో ఫలితాలను ప్రకటించే ప్రక్రియ మరింత సులభతరం, వేగవంతం అయ్యింది.అంతేకాకుండా అందుబాటులో ఉన్న ఖాళీల సంఖ్యకు అనుగుణంగా నిర్ణీత సంఖ్యలో అభ్యర్థులను ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలుస్తారు. పీసీబీ ఎనలిస్టు గ్రేడ్-2 పోస్టులకు ఈ నెల 12, 13 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి కాగా, 14వ తేదీన తుది ఎంపిక జాబితాను విడుదల చేశారు. ఈ జాబితా సంబంధిత శాఖలకు చేరిన తర్వాత నియామక ఉత్తర్వులు జారీ చేశారు.పీసీబీలో అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులకు సంబంధించి అక్టోబర్ 26న పరీక్ష నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఈ నెల 18, 19 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరుగుతుంది. ఆ తర్వాత రెండు మూడు రోజుల్లోనే తుది ఫలితాలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నెల 6, 7 తేదీలలో కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్ష (సీబీఆర్?టీ) నిర్వహించిన ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) పోస్టులకు సంబంధించి ప్రాథమిక సమాధానాల కీ విడుదల అయ్యింది. ఈ కీపై అభ్యంతరాలను తెలియజేయడానికి ఈ నెల 17వ తేదీని గడువుగా నిర్ణయించారు. ఆ తర్వాత ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసి, ఈ నెలాఖరులోగా తుది జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది.

మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారినిపై ఏసీబీ దాడులు.. అక్రమాస్తుల గుర్తింపు



హైదరాబాద్ :ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో మొయినాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణిపై ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం హైదరాబాద్, మహబూబ్‌నగర్ సహా పలు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఆమెకు సంబంధించిన నివాసం, బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాలు కలిపి మొత్తం 10 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు.రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ మార్గాలు, ఆస్తుల సమీకరణ వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆదాయ వనరులకు మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు వాణిపై ఆరోపణలు ఉన్నాయి.సెప్టెంబర్ 30న లంచం కేసులో ఆమె ఏసీబీకి పట్టుబడిన ఘటన ఈ దర్యాప్తునకు కారణమైంది. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రూ.75 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమె తరఫున ఆ మొత్తాన్ని స్వీకరిస్తుండగా మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాలమోని సుదర్శన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు తర్వాత వాణిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి తాజా సోదాలు చేపట్టారు.

హైదరాబాద్‌లో మెడికల్ షాపులోకి దూసుకెళ్లిన కొత్త కారు

హైదరాబాద్:హైదరాబాద్‌లోని రాంనగర్ ప్రాంతంలో సోమవారం ఉదయం ఓ కారు తీవ్ర బీభత్సం సృష్టించింది. కొత్తగా కొనుగోలు చేసిన కారు అదుపుతప్పి రోడ్డుపై ఉన్న వాహనాలను, కూరగాయల బండిని ఢీకొడుతూ సమీపంలోని ఓ మెడికల్ షాపులోకి దూసుకెళ్లింది. ఈ ఊహించని ప్రమాదంలో కూరగాయలు విక్రయించుకునే ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికుల కథనం ప్రకారం.. రాంనగర్ కమాన్ వైపు నుంచి స్థానిక దేవాలయం వైపు వెళుతున్న కొత్త కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయింది. అతివేగంతో ముందుకు దూసుకొచ్చిన ఆ వాహనం, తొలుత రోడ్డు పక్కన నిలిపి ఉంచిన పలు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టింది.



అనంతరం సమీపంలోని కూరగాయల బండిపైకి దూసుకెళ్లి, చివరకు పక్కనే ఉన్న ఓ మెడికల్ షాపులోకి చొచ్చుకెళ్లి ఆగింది.ప్రమాదం జరిగిన సమయంలో మెడికల్ షాపు మూసి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. లోపల ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పినప్పటికీ, కూరగాయల బండి వద్ద వ్యాపారం చేసుకుంటున్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.సమాచారం అందుకున్న వెంటనే ముషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడానికి గల అసలు కారణాలు ఏమిటనే దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి అతివేగమా, సాంకేతిక లోపమా లేక డ్రైవింగ్ వైఫల్యమా అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

'వాయిస్ శాంపిల్ ఇవ్వాల్సిందే' - పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్ :బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. వాయిస్ శాంపిల్ ఇవ్వాలని సీఐడీ అధికారులు జారీ చేసిన నోటీసును సవాల్ చేస్తూ పాడి కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్?ను హైకోర్టు కొట్టివేసింది.హుజూరాబాద్ పీఎస్?లలో కేసులు నమోదుఈ ఏడాది జనవరి నెలలో సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో కరీంనగర్ జిల్లా వీణవంక వద్ద పోలీసులు పాడి కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం హుజూరాబాద్?కు తరలించారు. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుకు నిరసనగా కౌశిక్ రెడ్డి హుజూరాబాద్?లో రోడ్డుపై బైఠాయించారు. ఈ క్రమంలో కరీంనగర్ ఎస్పీని ధూషించడంతో పాటు పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదు మేరకు పాడి కౌశిక్ రెడ్డిపై వీణవంకతో పాటు హుజూరాబాద్ పీఎస్?లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. పాడి కౌశిక్ రెడ్డిపై నమోదైన ఈ రెండు కేసులను పోలీసు అధికారులు సీఐడీకి బదిలీ చేశారు.వాయిస్ శాంపిల్స్ ఇవ్వాల్సిందేనని తీర్పుఈ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు వాయిస్ శాంపిల్స్ ఇవ్వాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ



కరీంనగర్ కోర్టులో కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. విచారణ నిర్వహించిన కరీంనగర్ కోర్టు వాయిస్ శాంపిల్స్ ఇవ్వాల్సిందేనని కౌశిక్ రెడ్డికి తేల్చి చెప్పింది. కింది కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పాడి కౌశిక్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ కక్షల కారణంగా నమోదైన కేసులో భాగంగా సీఐడీ అధికారులు వేధిస్తున్నారని కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది వాదించారు.కరీంనగర్ కోర్టు ఉత్తర్వులను సమర్థించిన హైకోర్టుఎస్పీని దూషించిన క్రమంలో సీఐడీ అధికారులు దర్యాప్తులో భాగంగా చట్ట ప్రకారం వాయిస్ శాంపిల్స్ సేకరిస్తున్నారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు కోర్టులో వాదించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. కరీంనగర్ కోర్టు ఉత్తర్వులను సమర్థిస్తూ హైకోర్టు నేడు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాడి కౌశిక్ రెడ్డి తన వాయిస్ శాంపిల్స్?ను సీఐడీ అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది.


తెలంగాణ పదో తరగతి విద్యార్థులకు ఊరట.. పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

హైదరాబాద్ :తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు (ఎస్-ఎస్సీ 2027) రాయబోయే విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ కీలక సమాచారం అందించింది. పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ, సవరించిన నూతన షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఫీజు చెల్లింపు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం.. ఎలాంటి ఆలస్య రుసుము (లేట్ ఫీజు) లేకుండా నవంబర్ 26 వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 8 వరకు అవకాశం కల్పించారు. రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 10 నుంచి డిసెంబర్ 21 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 23 నుంచి జనవరి 4 వరకు ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.ఫీజుల వివరాలను పరిశీలిస్తే.. రెగ్యులర్ విద్యార్థులు



మూడు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు రాసేందుకు రూ.125 ఫీజుగా నిర్ణయించారు. మూడు సబ్జెక్టుల వరకు మాత్రమే రాసేవారు రూ.110 చెల్లించాల్సి ఉంటుంది. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు రెగ్యులర్ ఫీజుకు అదనంగా మరో రూ.60 చెల్లించాలి. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు పరీక్ష ఫీజు నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చారు.పరీక్ష ఫీజు చెల్లింపు విధానంపై విద్యాశాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఫీజు మొత్తాన్ని అధికారిక వెబ్‌సైట్ ద్వారా కేవలం ఆన్‌లైన్ పద్ధతిలోనే పాఠశాల లాగిన్ ఉపయోగించి చెల్లించాల్సి ఉంటుంది. మాన్యువల్ ఐఎఫ్ఎంఎస్ () చలాన్లు లేదా బ్యాంకుల ద్వారా నేరుగా తీసే ఫిజికల్ చలాన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమని స్పష్టం చేసింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను పరిశీలించి, నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

భారీ డిస్కౌంట్లు ఇస్తామంటే నమ్మొద్దు: టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో



హైదరాబాద్, నవంబర్ 11: రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరికలు జారీ చేసింది. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సైబర్ నేరగాళ్లు ముఖ్యంగా నకిలీ ఆన్‌లైన్ ప్రకటనలు, క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారని.. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్ సెక్యూరిటీ బ్యూరో.. ప్రజలకు పబ్లిక్ అడ్వైజరీ జారీ చేసింది. సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనల పేరుతో.. వల పన్ని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఇందుకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ముందుగా.. బ్రాండెడ్ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, దుస్తులపై భారీ డిస్కౌంట్లంటూ ప్రకటనలు ఇచ్చి.. అనంతరం డిజిటల్ వాలెట్లు, బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ల ద్వారా డబ్బులు వసూలు చేస్తారని.. ఆ తర్వాత నకిలీ ఆర్డర్ కన్ఫర్మేషన్ పంపి డెలివరీ ఆలస్యమంటూ..డబ్బులు తీసుకున్న తర్వాత బాధితుల ఫోన్ నంబర్లు బ్లాక్ చేయడంతో పాటు.. నకిలీ వెబ్‌సైట్లను కూడా మాయం చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వస్తువులు అందకపోవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు.

ఓటుకు వెయ్యి, ఉచిత ప్రయాణం!.. హైదరాబాద్ వాసులకు ఏపీ పంచాయతీ నేతల ఆఫర్లు

హైదరాబాద్ :



ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరుకుంది. స్థానిక పోరులో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు.. ఇప్పుడు హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా ఓటర్లపై దృష్టి సారించాయి. ఓటు వేసేందుకు వారిని సొంత గ్రామాలకు రప్పించేందుకు నగదు, ఉచిత ప్రయాణం వంటి ప్రలోభాలను ఎరగా వేస్తూ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం, ఏపీలో పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13,000 సర్పంచ్, 1.32 లక్షల వార్డు సభ్యుల స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతుండగా, మొత్తం 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలి విడత నామినేషన్ల గడువు నవంబర్ 17తో ముగియనుండటంతో ప్రచారం మరింత హోరాహోరీగా మారనుంది.ఈ నేపథ్యంలో, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, అమీర్‌పేట, మియాపూర్, బేగంపేట వంటి ప్రాంతాల్లో ఆంధ్రా ఓటర్లు అధికంగా నివసించే చోట్ల అభ్యర్థులు, వారి అనుచరులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఓటర్ల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, పోలింగ్ రోజున తప్పనిసరిగా గ్రామానికి వచ్చి ఓటు వేయాలని కోరుతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ సర్పంచ్ అభ్యర్థి, తన గ్రామానికి చెందిన ఓటర్లకు ఓటుకు రూ.1,000 చొప్పున (ఒక కుటుంబంలో ఐదు ఓట్లు ఉంటే రూ.5,000), ప్రయాణ ఖర్చులు అదనంగా ఇస్తానని ఆఫర్ చేసినట్లు సమాచారం.

హైదరాబాద్‌లో ఆటోల సమ్మె.. నవంబర్ 30న బంద్‌కు పిలుపు

హైదరాబాద్ :కొత్త మీటర్ చార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ గ్రీన్ క్యాబ్‌లు, బైక్ ట్యాక్సీలను నిషేధించాలని ఆటో సంఘాల పట్టు 15 రోజుల్లో డిమాండ్లు నెరవేర్చకపోతే బంద్ ఖాయమని హెచ్చరిక రవాణా శాఖ మంత్రి రాజీనామా చేయాలని జేఏసీ డిమాండ్ హైదరాబాద్ లో నవంబర్ 30న ఆటోల బంద్‌కు మహాత్మా గాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ పిలుపునిచ్చింది. పెంచిన ఆటో మీటర్ చార్జీలను వెంటనే అమలు చేయాలని, గ్రీన్ క్యాబ్‌లను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించింది. 15 రోజుల్లో తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే బంద్ ఖాయమని, అప్పటికీ స్పందించకపోతే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి రాజీనామా చేయాలని హెచ్చరించింది.హైదర్‌గూడలో నేడు ఏర్పాటు



చేసిన మీడియా సమావేశంలో జేఏసీ కన్వీనర్ మహమ్మద్ అమానుల్లా ఖాన్ మాట్లాడారు. ప్రభుత్వం గ్రీన్ క్యాబ్‌లకు అనుమతి ఇవ్వడం వల్ల ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ క్యాబ్‌లను తక్షణమే నిషేధించడంతో పాటు బెంగళూరులో మాదిరిగా నగరంలో బైక్ ట్యాక్సీలను రద్దు చేయాలని కోరారు.ఆటో డ్రైవర్లకు గతంలో హామీ ఇచ్చిన ప్రకారం, ఏడాదికి రూ. 12,000 చొప్పున మొత్తం రూ. 36,000 బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల దుండగుల దాడిలో మరణించిన ఆటో డ్రైవర్ మహమ్మద్ ముకరం కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల పరిహారం అందించాలని కోరారు.ఇటీవల ప్రభుత్వం ఆటో కనీస చార్జీని 1.6 కిలోమీటర్లకు రూ. 30గా, ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ. 14గా నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే, ఈ చార్జీలు ఇంకా అమలులోకి రాకపోవడంతో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నందికొట్కూరులో మరో 30-40 ఏళ్లు టీడీపీదే అధికారం:



నంద్యాల, నవంబర్ 16: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. (సోమవారం) నందికొట్కూరు మున్సిపాలిటీ 29, 30వ వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలతో ఎంపీ సమావేశమయ్యారు. నందికొట్కూరులో గత ఎన్నికల్లో టీడీపీ ఓటమికి గల కారణాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాయలసీమను రత్నాల సీమగా మారుస్తున్నామని తెలిపారు. రాబోయే 30-40 ఏళ్ల పాటు నందికొట్కూరులో టీడీపీ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. బయటి నుంచి వచ్చి పెత్తనం చేస్తే కార్యకర్తలు చూస్తూ ఊరుకోరంటూ ఎంపీ వ్యాఖ్యానించారు. ?పార్టీ కోసం కష్టపడతామని.. ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదని ఎంపీ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు. ఈరోజు నందికొట్కూరులో ఎంపీ పర్యటించారు. ఈ సందర్భంగా ?హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జమ్మి చెట్టు వద్ద నూతన శివాలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ శబరి హామీ ఇచ్చారు.

రాష్ట్రానికి 'అక్వాన్' ముప్పు - విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి ఆదేశం

అమరావతి:అర్నబ్, మురసు తుపానుల నుంచి ఇంకా కోలు కోకముందే తాజాగా మరో తుపాను రాష్ట్ర ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోం ది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది రాష్ట్రంపై భారీగా ప్రభావం చూపనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ తుపాను తీవ్రత వల్ల విద్యుత్ శాఖకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష నిర్వహించారు.అక్వాన్ తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తుపాను తీవ్రతతో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. అర్నాబ్, మురసు తుపానుల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు కూలినా, సరఫరాకు అంతరాయం కలిగినా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.తగినంత సిబ్బందిని అందుబాటులో ఉంచి నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. శాఖాపరమైన నిర్లక్ష్యంతో ఎలాంటి నష్టం జరగడానికి వీల్లేదని



తేల్చిచెప్పారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేసినా, అంతరాయం ఏర్పడినా ప్రజలకు ముందుగానే సమాచారం ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.తీవ్ర వాయుగుండంగా 'అక్వాన్' : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఆగ్నేయ, ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో ఇది కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటల్లో గంటకు 8 కి.మీ వేగంతో కదిలినట్లు వాతావరణశాఖ తెలిపింది. ప్రస్తుతం ఇది అండమాన్‌కు 640 కి.మీ. చెన్నైకు 760 కి.మీ, విశాఖకు 870 కి.మీ, గోపాల్‌పూర్‌కు 980 కి.మీ దూరంలో కేంద్రీకృతమైనట్లు వెల్లడించింది.ప్రజలు, రైతులకు ముందస్తు జాగ్రత్తలు : దక్షిణ మధ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో నేడు (సోమవారం) సాయంత్రానికి తుపానుగా బలపడే అవకాశముందని తెలిపింది. మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్రతుపానుగా మారే వీలుందని పేర్కొంది. ఆ తదుపరి 48 గంటల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతానికి చేరుకునే అవకాశముందని వెల్లడించింది. ఆగ్నేయ, ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో ఇది కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటల్లో గంటకు 8 కి.మీ వేగంతో కదిలినట్లు వాతావరణశాఖ తెలిపింది. ప్రస్తుతం ఇది అండమాన్‌కు 640 కి.మీ. చెన్నైకు 760 కి.మీ, దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో గురు, శుక్రవారాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ తుపానుకు ఇరాన్ 'అక్వాన్'గా నామకరణం చేసింది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ సూచించారు.

ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల - 29న పోలింగ్

అమరావతి: ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసింది. నవంబర్ 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 21న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నవంబర్ 22న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లకు అవకాశం కల్పించిన ఎస్?ఈసీ నవంబర్ 23న ఆ అప్పీళ్లను పరిష్కరిస్తుంది. నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించింది.నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. నవంబర్ 29 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. నవంబర్ 30న అవసరమైన ప్రాంతాల్లో రీపోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు.

రెండో విడత ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నవంబర్ 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ

నవంబర్ 21 ఉదయం 8 నుంచి నామినేషన్ల పరిశీలన

నవంబర్ 22 సా.5 వరకు తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లకు అవకాశం నవంబర్ 23న నామినేషన్ల అప్పీళ్ల పరిష్కారం

నవంబర్ 24 మ.3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం నవంబర్ 24 మ.3 తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన నవంబర్ 29 ఉ.7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నవంబర్ 29 మధ్యాహ్నం 2 గంటల



నుంచి ఓట్ల లెక్కింపు నవంబర్ 30న అవసరమైన ప్రాంతాల్లో రీపోలింగ్, అనంతరం ఫలితాల ప్రకటనటమూడు దశల్లో పోలింగ్ : రాష్ట్రంలో 13,171 పంచాయతీలకు మూడు దశల్లో పోలింగ్ నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26, 29, డిసెంబరు 2న మూడు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈనెల 17న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 21 తుదిగడువు. ఈనెల 26న పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. రీపోలింగ్ అవసరమైతే ఈనెల 27న నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.చిటికెలో పంచాయతీ ఎన్నికల సమాచారం : రాష్ట్రంలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏ ఊరిలో ఎప్పుడు పోలింగ్ జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రభుత్వం స్వర్ణ పంనుంచి ఓట్ల లెక్కింపు నవంబర్ 30న అవసరమైన ప్రాంతాల్లో చాయతీ పోర్టల్ వివరాలు పొందుపరిచింది. మొబైల్ ఫోన్‌లో ఈ సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. జిల్లా, మండలం, పంచాయతీని ఎంపిక చేసి సెర్చ్ చేయగానే గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూలు వివరాలు వస్తాయి. ఆస్తి పన్నుతో పాటు వివిధ రుసుముల వసూళ్ల కోసం ప్రారంభించిన స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఇప్పటికే బాగా ప్రాచుర్యం పొందింది.

శ్రీకాళహస్తిలో గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్



తిరుపతి, నవంబర్ 11: జిల్లాలోని శ్రీకాళహస్తి ప్రాంతంలో గంజాయి అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్కుర్తి రైల్వే గేటు సమీపంలో తనిఖీలు నిర్వహించి.. అనుమానాస్పదంగా ఉన్న బర్రి మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి అక్రమంగా విక్రయించేందుకు తీసుకొచ్చిన 1,100 గ్రాముల గంజాయితో పాటు ఒక బైక్, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని విచారించగా, ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు వెల్లడించినట్లు సమాచారం. గంజాయి అక్రమ రవాణా, విక్రయాల వెనుక మరెవరైనా ఉన్నారా? ఈ వ్యవహారంలో ఇతర వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి నిల్వలు.. అక్రమ విక్రయాలు లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే ప్రజలు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం ఉంటే వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం.. ఏజెంట్‌పై పీడీ యాక్ట్ నమోదు

విశాఖపట్నం, కంబోడియా, మయన్మార్ దేశాలకు నిరుద్యోగ యువతను తరలించి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ప్రధాన ఏజెంట్ చుక్క రాజేశ్ వినయ్ కుమార్‌పై విశాఖపట్నం పోలీసులు పీడీ (గ్రాణ) యాక్ట్ నమోదు చేశారు. తక్కువ చదువుకున్నా పర్లేదంటూ, ఏసీ రూముల్లో లక్షల్లో జీతమంటూ ఆశచూపించి అమాయకులను ఏజెంట్ మోసం చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. గాజువాక కేంద్రంగా ఇన్‌స్టిట్యూట్ నడుపుతున్న రాజేశ్ పలువురు నిరుద్యోగులను విదేశాలకు పంపి మోసం చేసినట్లుగా పోలీసులు నిర్ధారించారు.కంబోడియా, బ్యాంకాక్ వెళ్లిన యువకులతో ఇండియాకు వ్యతిరేకంగా సైబర్ స్కామ్స్ చేయిస్తూ అక్కడ తీవ్ర వేధింపులకు గురిచేశారని బాధితులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. నిరుద్యోగుల నుంచి నగదు, ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేసి ఫ్లైట్ టికెట్లు, ఈ-వీసాలను ఏజెంట్ రాజేశ్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ ఉండే విదేశీ ఏజెంట్లకు ఇక్కడి నిరుద్యోగులను అమ్ముకుంటున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు.చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై తమకు ఫిర్యాదు చేయాలని విశాఖపట్నం పోలీసులు పేర్కొన్నారు.

16 రకాలు, 9 టన్నులు - తిరుమలలో వైభవంగా పుష్పాల ఊరేగింపు

తిరుపతి:కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తిక మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే పుష్పయాగానికి అవసరమైన పుష్పాల ఊరేగింపు (సోమవారం) ఘనంగా జరిగింది. తిరుమలలోని కల్యాణవేదిక వద్ద గల ఉద్యాన విభాగంలో పుష్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, ఉద్యాన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది, శ్రీవారి సేవకులతో కలిసి పుష్పాలను ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వరకు తీసుకెళ్లారు.దోష నివారణకు పుష్పయాగం : అనంతరం టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి బ్రహ్మో త్సవాల్లో తెలియక ఏమైనా దోషాలు జరిగి ఉంటే ఆ దోష



నివారణకు బ్రహ్మోత్సవాల తర్వాత వచ్చే కార్తిక మాసంలో శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. లోక కల్యాణార్థం 15వ శతాబ్దం నుంచి పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ తరువాత నిలిచిపోయిన ఈ మహోత్సవాన్ని 1980 నుంచి టీటీడీ పునరుద్ధరించి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పుష్పయాగం కోసం 16 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలను వినియోగిస్తామన్నారు. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు టన్నులు కలిపి మొత్తం 9 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారని ఈవో తెలిపారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ : శ్రీవారి ఆలయంలో పుష్పయాగం సందర్భంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేదుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ కారణంగా ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.పుష్పయాగానికి అంకురార్పణ : నేడు జరుగుతున్న పుష్పయాగానికి రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం శ్రీవారి ఆలయంలో మూలవిరాట్ ఎదురుగా ఆచార్య రుత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే రుత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్లు అర్చకులు భావిస్తారు.

జగన్ అండ్ కో అవినీతి, అక్రమాలపై వెబ్‌సిరీస్ తీస్తే అంతం ఉండదు

అమరావతి, నవంబరు 16 ::

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అండ్ కో అవినీతి, అక్రమాలపై వెబ్‌సిరీస్ తీస్తే దానికి అంతం ఉండదని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డితో పాటు ఆయన చుట్టూ ఉన్న వారి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతోందని పేర్కొన్నారు. గతంలో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని సూట్‌కేస్ కంపెనీలను ఆయన సృష్టించారని ధ్వజమెత్తారు. (సోమవారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. గతంలో సీఎంవోలో కీలకంగా పనిచేసిన వ్యక్తుల వద్ద రూ.వందల కోట్ల ఆస్తులు ఎలా



వచ్చాయి..? అని ప్రశ్నించారు.వందల కోట్ల ఆస్తులు ఎక్కడివి..?..కేవలం రూ.2 లక్షల జీతం తీసుకునే వారికి భార్యలు, బంధువుల పేరున వందల కోట్ల ఆస్తులు ఎక్కడివి..? అని మంత్రి కొల్లు రవీంద్ర నిలదీశారు. టిఫిన్ బండి నడిపిన వ్యక్తికి రూ.వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలు గమనించాలని అన్నారు. మద్యం, మైనింగ్, భూముల దోపిడీ ద్వారా ప్రజాధనాన్ని విదేశాలకు జగన్ అండ్ కో తరలించారని ఆరోపించారు. దోచుకున్న సొమ్మును సౌతాఫ్రికా, ఫిలిప్పీన్స్, థాయి లాండ్, మలేషియా దేశాల్లో పెట్టుబడులుగా పెట్టారని మండిపడ్డారు. విదేశాలకు తరలించిన డబ్బును సాఫ్ట్‌వేర్ కంపెనీల పేరుతో మళ్లీ వెనక్కు తెచ్చుకుంటున్నారని ఆరోపించారు.ఎన్నికల్లో వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదు..'జే బ్రాండ్స్' మద్యంతో 30 వేల మంది ఆడబిడ్డల తాళిబొట్లును తెంపారని మంత్రి దుయ్యబట్టారు. నాసిరకం మద్యం వల్ల కిడ్నీ, లివర్ వ్యాధులతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. సొంత తల్లిని, చెల్లిని జగన్ ఇంట్లోంచి పంపేశారని ఆగ్రహించారు. గతంలో ఓబులాపురం గనుల విషయంలో తాము చెప్పినట్లుగానే నేడు జడ్జిమెంట్ వచ్చిందని ప్రస్తావించారు. ప్రజల ఆగ్రహం వల్లే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

"మందుల ధరలు తగ్గించాలి" - పీఎం మోదీకి లింగంనేని రమేశ్ లేఖ

అమరావతి, నవంబరు 16 ::



మందుల ధరలను నియంత్రించేందుకు ఒక జాతీయ విధానాన్ని రూపొందించాలని కోరుతూ జనసేన రాజ్యసభ సభ్యుడు లింగంనేని రమేశ్? ప్రధానమంత్రి మోదీకి లేఖ రాశారు. క్యాన్సర్ మందులపై వ్యాపార మార్జిన్‌లను తగ్గించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, మధుమేహం, గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధుల మందుల ధరలను కూడా సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అభ్యర్థించారు.అత్యవసర, ప్రాణరక్షక మందుల వ్యాపార మార్జిన్‌లపై శాస్త్రీయ, పారదర్శకమైన పరిమితులను విధించాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో మరిన్ని 'జన్ ఔషధి' (సరసమైన మందుల) కేంద్రాలను ఏర్పాటు చేయాలని కూడా ఎంపీ రమేశ్? పిలుపునిచ్చారు. తన లేఖలో, 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు నడుపుతున్న ఆరోగ్య బీమా కార్యక్రమాలతో అనుసంధానించాలని ఆయన అభ్యర్థించారు. మలేరియా, ఇతర అంటువ్యాధుల బారిన తరచుగా పడే గిరిజన ప్రాంతాలలో వైద్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని ఆయన కోరారు.

Printed Published and Owned by Godishala Somaiah Published from H.No 15-76 (V&M)Medipally,(Dist) Medchal Malkajgiri - 500098. Printed at Sree Sesha Sai Enterprises,Plot no 19, IDA Balanagar, Hyderabad Editor: Godishala Somaiah,email: nhnews24@gmail.com ,ph : 9912580066 RNI APTEL/2012/45237